Follow: @ANNTELUGU
21-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 144 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## భారత్- ఇటలీ బంధం దృఢం

**ప్రధాని మోదీ**

**మహా:** భారత్ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు సరికొత్త శిఖరాలకు చేరాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో జరిగిన విస్తృతస్థాయి చర్చల అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'భారత్ఇటలీ సంయుక్త వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక 202529' గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఒక ఆచరణాత్మక, భవిష్యత్ ఆధారిత నిర్మాణాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఇరుదేశాల నాయకుల మధ్య పెరుగుతున్న నిరంతర చర్చలు, సమావేశాలు ఇరుపక్షాల మధ్య బలపడుతున్న సహకారానికి, పరస్పర నమ్మకానికి నిదర్శనమని మోదీ అన్నారు.

### మెలోడి గిఫ్ట్.. అమాంతం పెరిగిన పార్లే షేర్లు

ఇటలీ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనికి 'మెలోడీ' చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకున్నారు. ఈ మెలోనీ రీల్ వైరల్ అయిన కొద్దిసేపటికే భారత స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్లు కూడా అనూహ్యంగా స్పందించారు. పార్లే సంస్థ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలో పార్లే ఇండస్ట్రీస్‌కు చెందిన 8 లక్షల షేర్లు చేతులు మారాయి.

**టాప్ న్యూస్**

### కొత్త పార్టీ పెట్టే ప్రసక్తే లేదు

- చివరి శ్వాస వరకు బీజేపీతోనే
- కన్న కొడుకునే పోలీసులకు అప్పగించా
- కేంద్రమంత్రి బండి సంజయ్



02

### ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి

- ఆర్బీఐ సంచలన నిర్ణయం
- రూ.96.68కి పడిపోవడంతో అలర్ట్

02

### 1967 తర్వాత..

- తమిళనాడు కేబినెట్ లో కాంగ్రెస్ మంత్రులు

02

# స్పెక్ట్రా.. అంతా మాయ

## రూటు మార్చిన రియల్ మాఫియా

- 82 ఎకరాల వెంచర్ కు గ్రామ పంచాయతీ అనుమతులా?
- గజం మార్కెట్ ధర రూ.10వేల పై మాటే
- ప్రభుత్వ విలువ రూ.700కే రిజిస్ట్రేషన్లు.. రియల్టర్లతో కుమ్మక్కైన సబ్ రిజిస్ట్రార్
- కోట్ల రూపాయలు దండుకున్న అవినీతి అక్రమార్కులు
- ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న తోడు దొంగలు
- పత్తా లేని ఆదాయపు పన్ను శాఖ..
- రెరా చట్టానికి రియల్టర్ల తూట్లు
- సబ్ రిజిస్ట్రార్ పై ఏసీబీ నజరేదీ?
- గ్రామపంచాయతీ లే ఔట్ లో.. రిజిస్ట్రేషన్ చేస్తే జైలుకే డీపీవో శ్రీనివాసరెడ్డి
- స్పెక్ట్రా అరాచకంపై సంచలనమైన మహా కథనం

**యాదగిరి గుట్ట సబ్ రిజిస్ట్రార్ తో కుమ్మక్కైన రియల్ మాఫియా రూటు మార్చింది. 1988లోనే పంచాయతీరాజ్ యాక్ట్‌ను గత ప్రభుత్వాలు రద్దుచేసినప్పటికీ గ్రామపంచాయతీ(జీపీ) లే ఔట్ అంటూ స్పెక్ట్రా అంతా మాయ చేసి తెరపైకి తెచ్చింది. నాకింత.. నీకింత.. మనకే అంతా అన్న చందంగా దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లు రియల్ మాఫియా వేలకోట్లు కొల్లగొట్టింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన వందలకోట్లు ఎగనామం పెట్టినా అడ్డుకోవాల్సిన రెరా, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్, ఆదాయపన్ను శాఖ అధికారులు పత్తా లేకుండా పోయారని, అవినీతి తిమింగలాలను పట్టి జైలుకు పంపాల్సిన ఏసీబీ అధికారుల నజరేదీ ? అంటూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. స్పెక్ట్రా అరాచకంపై బుధవారం మహాపత్రికలో ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు, ఏసీబీ ఉన్నతాధికారులు దృష్టి పెట్టినట్లు తెలిసింది. ఇప్పటిదాకా జరిగిన రిజిస్ట్రేషన్లపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.**



**ప్రత్యేక ప్రతినిధి, మహా:**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట మండలం మాసాయిపేట, సైదాపూర్ గ్రామాల సరిహద్దుల్లో స్పెక్ట్రా మహాసిటీ, గెలాక్సీల పేర్లతో రియల్ మాఫియా రాజ్యమేలుతోంది. సబ్ రిజిస్ట్రార్ తో కుమ్మక్కైన రియల్ మాఫియా రూటుమార్చి వేలకోట్లు కొల్లగొట్టేందుకు కుయుక్తులు పన్నింది. 1988లో రద్దుచేయబడిన పంచాయతీరాజ్ యాక్ట్ ను తెరపైకి తెచ్చి గ్రామపంచాయతీ లేఔట్ అంటూ అమాయకులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటోంది. ఎకరం విస్తీర్ణంలో వెంచర్ వేయాలన్న డీటీసీపీ, హెచ్ఎండీఏ నుండి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటిది ఏకంగా 82ఎకరాల్లో లేఔట్ వేసి విక్రయాలు జరుపుతుంటే జిల్లా పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీటీసీపీ రెరా నిబంధనల ప్రకారం చేయాల్సిన


మహా
epaper.mahaadaily.com 20 May 2026 - Page 1
స్పెక్ట్రా అరాచకం
రియల్ మాఫియా కనుసన్నల్లోనే అధికార యంత్రాంగం
నకిలీ ఎన్వోసీలతో డీటీసీపీ అనుమతులు
పలుగోని చెరువు ఆనవాళ్లు గల్లంతు

లేఔట్లు గ్రామపంచాయతీ (జీపీ) లేఔట్ వేసి విక్రయిస్తుంటే జిల్లా అధికారయంత్రాంగంపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మిగతా 2లో

### జీపీ లేఔట్ పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తే జైలుకే...

గ్రామపంచాయతీ లే ఔట్ పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తే సబ్ రిజిస్ట్రార్లు జైలుకు వెళ్ళక తప్పదని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. 2020 సంవత్సరానికి ముందు అడపాదడపా గ్రామపంచాయతీ వెంచర్లు జరిగిన మాట వాస్తవమేనని, 2020 తర్వాత ఎకరం నుండి ఆపై ఎన్ని ఎకరాలైనా డీటీసీపీ తమ హెచ్ఎండిఏ రెరాల నుండి అనుమతులు పొందాలని మహా పత్రిక ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం ( ఎల్ ఆర్ ఎస్) కట్టి రిజిస్ట్రేషన్లు చేస్తున్నామంటే అది అక్రమార్గంలో చేసినట్లు అవుతుందని, ఈ వ్యవహారంపై రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల అధికారులకు ఫిర్యాదుచేస్తామన్నారు. గ్రామపంచాయతీ లే ఔట్ పేరుతో సాగుతున్న ప్లాట్లను అమాయకులు కొనుగోలు చేసి మోసపోవొద్దని ఆయన సూచించారు. జిల్లా అధికారయంత్రాంగం స్పందించి రియల్ మాఫియా పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. - డీపీవో శ్రీనివాసరెడ్డి

## ఫ్యూచర్ సిటీపై సీఎం ఫోకస్

### 1500 ఎకరాల్లో డేటా సిటీ



- ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో ప్రత్యేక విభాగం
- అంతర్జాతీయ స్థాయి మౌళిక వసతులు
- జూన్‌లో ఇండ్రస్టియల్ పార్క్ లో పరిశ్రమలకు శంకుస్థాపన
- మూడునెలల్లో టీ-ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే
- సమీక్ష సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్, మహా :** ఫ్యూచర్ సిటీలో 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. వచ్చే నెలలో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని, తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. నెట్ జీరో సిటీ తరహాలో డిజైన్లు ఉండాలని రాజీపడవద్దని సీఎం స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే భూములు కేటాయించాలని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీసెస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించనున్నట్లు సీఎం ప్రకటించారు.

మిగతా 2లో

### హైదరాబాద్ మెట్రో రెండో దశకు

## కేంద్రం గ్రీన్‌సిగ్నల్

### 50 శాతం నిధులు ఇచ్చేందుకు సుముఖత

మూసీ ప్రక్షాళనకు 'అమృత్ 2.0' కింద రూ.3,975 కోట్లతో 39 ఎస్టీపీలు మంజూరు

కేంద్రమంత్రి ఖట్టర్ తో కిషన్ రెడ్డి భేటీ

హైదరాబాద్ ప్రజారవాణా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల ప్రాజెక్టులపై సమీక్ష



**ఢిల్లీ, మహా:** భాగ్యనగర రవాణా ముఖచిత్రాన్ని మార్చే హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించి ఒక కీలక ముందడుగు పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున నిధులను భరించే వ్యయ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టుతో ముందుకెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, జి. కిషన్‌రెడ్డి లు ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సంబంధించిన ముఖ్యాంశాలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థ నుంచి హైదరాబాద్ మెట్రో రైల్‌ను టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో, రెండో దశ విస్తరణపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు 162 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించిందని మంత్రులు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)తో పాటు ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం వాటిని సమగ్రంగా పరిశీలించి తదుపరి తుది నిర్ణయం తీసుకుంటుందని ఖట్టర్

మిగతా 2లో

## నిప్పుల కొలిమిలా తెలంగాణ

- 13 జిల్లాలకు రెడ్ అలర్ట్
- ఎండలకు నలుగురు బలి
- బయటకు రావద్దని హెచ్చరికలు జారీ
- జగిత్యాల జిల్లాలో గరిష్టంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగభగలాడుతున్నాడు. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రస్తుతం పతాక స్థాయికి చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీల వరకు అధికంగా నమోదు అవుతుండటంతో జనం ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేస్తూ హెచ్చరికలు చేసింది.

### అల్లాడుతున్న ఉత్తర తెలంగాణ

రాష్ట్రంలో బుధవారం నాటి వాతావరణ గణాంకాలు భయం గొల్పుతున్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల ఐలాపూర్‌లో 45.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత చాలా ముందుగానే పెరిగింది. 2025 మే 19న రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత 41.9 డిగ్రీలు ఉండగా, ఈ ఏడాది అదే సమయానికి 45.9 డిగ్రీలకు చేరుకోవడం వాతావరణ మార్పుల తీవ్రతకు అద్దం పడుతోంది.

మిగతా 2లో

## కోల్ గ్యాసిఫికేషన్ కు సింగరేణి రెడీ

విస్తరణకు సహకరించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి రిక్వెస్ట్

త్వరలో సంయుక్త సమావేశం

తెలంగాణకు రూ.5వేల కోట్లు ఇవ్వాలని నిర్మలాసీతారామన్ కు విజ్ఞప్తి



**ఢిల్లీ, మహా:** కోల్ గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో సింగరేణి కూడా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో సమావేశమైన భట్టి విక్రమార్క ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్-2 మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని భట్టి తెలిపారు.

# స్పెక్ట్రా.. అంతా మాయ



(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ మార్కెట్ లో గజం ధర రూ.10వేలకు పైగా అమ్మకాలు జరుపుతూ ప్రభుత్వ విలువ గజం రూ.700కే రియల్ మాఫియా రిజిస్ట్రేషన్లు చేస్తోంది. దీంతో వందలకోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా అవినీతి అధికారుల చెంతకు చేరుతోందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

## పత్తాలేని ఆదాయపు పన్ను శాఖ

భూ క్రయవిక్రయాల ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్లాదిరూపాయల ఆదాయపుపన్ను ఎగ్గొట్టి రియల్ మాఫియా అక్రమదందా కొనసాగిస్తున్నా అడ్డుకోవాల్సిన ఆదాయపు పన్నుశాఖ పత్తాలేకుండా పోయిందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట, సైదాపూర్ తదితర గ్రామాల్లో స్పెక్ట్రా అనే రియల్ ఎస్టేట్ కంపెనీ వేల ఎకరాల్లో లే ఔట్లు వేసి అక్రమంగా ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నదని, మాసాయిపేట మహాసిటీ పేరుతో జీపీ లే ఔట్ వేసి బహిరంగ మార్కెట్ లో గజం రూ.10వేలకు విక్రయించగా, ప్రభుత్వ ధర మాత్రం గజానికి రూ.700 చెల్లించి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్ ఆర్ ఎస్ పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## టీజీ రెరాకు తూట్లు

తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చట్టానికి రియల్ మాఫియా తూట్లు పొడుస్తోంది. రియల్ ఎస్టేట్ కంపెనీలు అమాయక కొనుగోలుదారులను మోసం చేయకుండా ఉండేందుకు రెరా చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తోంది. నివాస లేదా వాణిజ్య ప్రాజెక్టులను డెవలపర్లు మార్కెటింగ్ చేయడానికి బుకింగ్ లను స్వీకరించడానికి ముందు రెరా సంస్థ వద్ద తప్పనిసరిగా ఆయా రియల్ ఎస్టేట్ కంపెనీలు నమోదుచేయించుకోవాల్సి ఉంటుంది. కానీ యాదగిరిగుట్ట మండల్ మాసాయిపేటలో స్పెక్ట్రా గ్రామపంచాయతీ లే ఔట్ రెరా యాక్ట్ కు విరుద్ధంగా సాగుతోందని దీనిని బట్టి స్పష్టమవుతోంది. రెరా, ఇన్ కంటాక్స్, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్, ఏసీబీ వంటి నిఘా అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారయంత్రాంగంపై పంజా విసరడంలో విఫలమయ్యారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రియల్ మాఫియాపై కొరడా ఝుళిపించాలని వారు కోరుతున్నారు.

# కుల గణనకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

## ఎవరెంత అనేది ప్రభుత్వానికి తెలియాలన్న కోర్టు.. కులగణన వ్యతిరేక పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, మహా :** దేశంలో జరుగుతున్న జనాభా గణనలో కులాల వివరాలను సేకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. సంక్షేమ చర్యలు చేపట్టాలంటే వెనుకబడిన కులాల్లో ఎంత మంది జనాభా ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది అని కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. జనాభా గణన కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. సుధాకర్ గుమ్ముల అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కోర్టు తోసిపుచ్చింది. కుల గణన వల్ల రాజకీయ ప్రయోజనాల కోసం డేటా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని పిటిషనర్ వాదించారు. కులాల వారీగా వివరాలు సేకరించడం వల్ల సామాజిక, రాజకీయ సమస్యలు తలెత్తుతాయని, కార్పొరేట్ సంస్థలు కూడా ఈ డేటాను తమ స్వార్థం కోసం వాడుకుంటాయని తన వాదనలో పేర్కొన్నారు. అయితే, ఈ వాదనతో కోర్టు ఏకీభవించలేదు. ఈ కేసు విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతుల కూర్పును, వారి జనాభా విస్తృతిని నిర్ణయించడానికి ప్రభుత్వానికి ఇటువంటి డేటా చట్టబద్ధంగా అవసరమని కోర్టు పేర్కొంది. కుల గణనను 2027 జనాభా గణనలో చేర్చాలా వద్దా అనేది నిర్ణయించడం కోర్టు పరిధిలోకి రాదని సిజెఐ పేర్కొన్నారు. ఎవరెవరు వెనుకబడి ఉన్నారో తెలిసినప్పుడే ప్రభుత్వం సరైన సంక్షేమ పథకాలు రూపొందించగలదని ధర్మాసనం అభిప్రాయపడింది.

### రాజకీయ ప్రాధాన్యత

సెన్సస్ లో కుల గణనను చేర్చాలన్న డిమాండ్ గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. అనేక రాజకీయ పార్టీలు కుల గణన కోసం పట్టుబడుతుండగా, సుప్రీంకోర్టు తాజా తీర్పు ఆ వాదనలకు బలాన్ని ఇచ్చింది. కుల గణన డేటా వల్ల రిజర్వేషన్లు, విద్య, ఉపాధి వంటి రంగాల్లో వెనుకబడిన వర్గాలకు మరింత న్యాయం జరుగుతుందని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.సుప్రీంకోర్టు తీర్పుతో కుల గణనపై నెలకొన్న న్యాయపరమైన చిక్కులు తొలగిపోయినట్లయ్యింది.

## హైదరాబాద్ మెట్రో

# రెండో దశకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, నగర ప్రజల సౌకర్యార్థం ఈ ప్రాజెక్టుకు పూర్తి సానుకూలతతో ఉన్నామని ఆయన భరోసా ఇచ్చారు.

### మూసీపై ప్రత్యేక చర్చ

మెట్రో విస్తరణతో పాటు హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మూసీ నది ప్రక్షాళనపైనా ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు ప్రత్యేకంగా చర్చించారు. మూసీ నది పునరుజ్జీవనానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని ఖట్టర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం 'అమృత్ 2.0' పథకం కింద మూసీ నదిలోకి చేరుతున్న మురుగు నీటిని శుద్ధి చేసేందుకు రూ.3,975 కోట్ల భారీ వ్యయంతో మొత్తం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్టీపీ) మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నూతన 39 ఎస్టీపీల ఏర్పాటు ద్వారా ప్రతిరోజూ దాదాపు 972 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం లభిస్తుందని, దీనివల్ల మురికి నీరు నేరుగా మూసీలో కలవకుండా నిరోధించవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మూసీ నది పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తుందని వివరించారు. మహానగర సమగ్ర అభివృద్ధికి కేంద్రం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసినందుకు గానూ, హైదరాబాద్ ప్రజల తరఫున కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా మంత్రి ఖట్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నేరాలకు దీటుగా టెక్నాలజీ పోలీసింగ్

- పోలీసు వ్యవస్థలో సమూల ప్రక్షాళన
- కల్తీలు, సైబర్ క్రైమ్‌పై ఉక్కుపాదం!
- శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేదు
- పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



**హైదరాబాద్, మహా:** దేశంలో నేరాల స్వరూపం వేగంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, భవిష్యత్ సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు తెలంగాణ పోలీసు వ్యవస్థ సమూల ప్రక్షాళన దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక అడుగులు వేశారు. రాబోయే పదేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, పటిష్టమైన నిఘా వ్యవస్థతో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేని పోరాటం చేయాలని ఆయన పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌లతో పాటు అదనపు డీజీలు, ఐజీలు, కమిషనర్లతో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి పోలీసు శాఖలో తీసుకురావాల్సిన మార్పులపై సుదీర్ఘంగా సమీక్షించారు.

మారుతున్న నేరాల సరళిని అంచనా వేస్తూ, ముఖ్యంగా పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ముఖ్యమంత్రి ఆదేశించారు. సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ప్రత్యేక ఎంపిక ప్రక్రియ చేపట్టడంతో పాటు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో పోలీసు విభాగం కోసం ప్రత్యేక కోర్సును ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. పోలీసు యంత్రాంగం నిరంతర నిఘా నేత్రంలా పనిచేయాలని, డ్రోన్ పోలీసింగ్‌ను విస్తృతం చేయాలని సూచించారు. నూతన సాంకేతికత వినియోగం, సీసీ కెమెరాల సంఖ్య పెంపు, నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేయడం ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అత్యంత సమర్థవంతంగా వాడుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కాలానికి అనుగుణంగా ఫోరెన్సిక్, డేటా సెంటర్లను భారీగా పెంచుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

కేవలం శాంతిభద్రతలే కాకుండా ప్రజారోగ్యం, భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న కల్తీ ఆహారం, ప్రమాదాలపై ముఖ్యమంత్రి ఈ సమావేశంలో తీవ్ర స్థాయిలో స్పందించారు. కల్తీ ఆహారం వల్ల క్యాన్సర్ మహమ్మారి ఆందోళనకర స్థాయిలో ప్రబలుతున్న నేపథ్యంలో, దీని సూత్రధారులపై ఉక్కుపాదం మోపాలని, అవసరమైతే కల్తీ నిరోధానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని అధికారులకు సూచించారు. నగరంలో అడ్డగోలుగా వెలుస్తున్న ఫ్లెక్సీల నియంత్రణపై జీహెచ్‌ఎంసీ, పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాలు జరిగాక స్పందించడం కాకుండా, ముందస్తు నివారణా చర్యలపై మున్సిపల్, హైడ్రా విభాగాలతో సమన్వయం చేసుకుంటూ జూన్ 15 లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఫైర్ డిపార్ట్‌మెంట్‌ను ఆదేశించారు. నాలాలు, మ్యాన్‌హోల్స్ నిర్వహణలో మెట్రో వాటర్ వర్క్స్, ట్రాఫిక్ పోలీస్, హైడ్రా, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అలాగే, మాదకద్రవ్యాల మహమ్మారి బారిన పడిన బాధితుల కోసం ప్రత్యేక డీఅడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

పోలీసు శాఖలో సమూల సంస్కరణలు తీసుకువస్తూనే, అవినీతికి ఏమాత్రం తావులేకుండా కేవలం మెరిట్ ప్రాతిపదికన మాత్రమే పోస్టింగ్స్ ఇవ్వాలని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై, ఆర్గనైజ్డ్ క్రైమ్‌పై డేటా అనాలిసిస్ ఆధారంగా విజిలెన్స్ విభాగం ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే విజిలెన్స్‌కు మరిన్ని అధికారాలు కట్టబెట్టే అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. ఎస్‌ఐ నుంచి నాన్ క్యాడర్ ఐపీఎస్ వరకు పదోన్నతి పొందిన తర్వాత రెండేళ్ల పాటు ఇతర విభాగాల్లోనూ పనిచేసేలా మార్పులు తీసుకురావాలన్నారు. ఎస్పీలు నిరంతరం జిల్లాల్లో పర్యటించాలని, ఐజీ స్థాయి అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని, క్రైమ్ రివ్యూ మీటింగ్‌లు క్రమం తప్పకుండా జరగాలని ఆదేశించారు. వీఐపీలు, సెలబ్రిటీల కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చే సమయంలో ట్రాఫిక్, భద్రతా సమస్యలు తలెత్తకుండా కచ్చితమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ విభాగాన్ని ఒకే యూనిట్ కిందకు తీసుకురావాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణ ఒక పవిత్ర బాధ్యతని, ఇందులో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచడం, గంజాయి రవాణాను కఠినంగా అడ్డుకోవడం, విలేజ్ పోలీసింగ్‌ను బలోపేతం చేయడంతో పాటు కాలం చెల్లిన ఆయుధాలను తక్షణమే తొలగించి వ్యవస్థను ఆధునీకరించాలని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థలో అందరూ భాగస్వాములే అని, పరిధి దాటి ప్రవర్తించే అధికారులను ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించదని హెచ్చరించారు. పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, శాఖలో ఇకనుంచి అన్ని వాహనాలను ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలుగా మార్చాలని నిర్ణయించారు. పోలీసు వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల సంఖ్యను పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.



# మందుబాబులకు షాక్

## జూన్ 2 తర్వాత పెరగనున్న ధరలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో మందుబాబులకు ధరల షాక్ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. జూన్ 2 తర్వాత మద్యం ధరలు పెంచేందుకు సర్కార్ కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తి అయినట్లు సమాచారం. మద్యం ధరల పెంపునకు సంబంధించి.. ఇప్పటికే కమిటీ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. మద్యం తయారీ కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో ధరలు పెంచక తప్పని పరిస్థితి నెలకొంది. కమిటీ సిఫార్సుల కంటే తక్కువగానే ప్రభుత్వం ధరలు పెంచనుంది. సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం బ్రాండ్ల మద్యం ధరలు కూడా భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# నిప్పుల కొలిమిలా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల వంటి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాలుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు మార్కును దాటేశాయి. హైదరాబాద్‌లో వేడి తీవ్రం 43 డిగ్రీలుగా నమోదు అయ్యింది.

## ఎండలకు నలుగురు బలి

తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మంగళవారం వడదెబ్బకు గురైన నలుగురు వ్యక్తులు మరణించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరుకు చెందిన రాచర్ల రాజు అనే రైతు మరణించాడు. వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం అంతారానికి చెందిన శామ్యూల్ అనే కార్మికుడు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం మత్తడిగూడకు చెందిన లచ్చు అనే వృద్ధురాలు, శాంతినగర్‌కు చెందిన బిరుదుల కిరణ్ కుమార్ వడదెబ్బకు ప్రాణాలు వదిలేశారు. గాలిలో తేమ శాతం గణనీయంగా పడిపోవడం ఈ తీవ్రమైన వేడికి ప్రధాన కారణంగా వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గాలిలో తేమ 50 శాతం లోపు మాత్రమే ఉంటోంది. సాధారణంగా రాత్రివేళల్లో వచ్చే చల్లని గాలులు కూడా ఇప్పుడు వీయకపోవడం వల్ల రాత్రిపూట కూడా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వేడి ప్రభావం మరింత ఎక్కువగా ఉంటోంది.

## రెడ్ అలర్ట్ జిల్లాలు ఇవే ..

రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు 46 నుంచి 47 డిగ్రీల మధ్య నమోదు అయ్యే ఛాన్స్ ఉండటంతో వాతావరణ శాఖ కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల. ఈ ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళ జనం బయటకు రావడం ప్రాణాపాయమని అధికారులు హెచ్చరించారు. ఒకవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. మెదక్, సిద్ధిపేట జిల్లాల్లో అకాల వర్షం కురిసింది. భారీగా వీచిన గాలులు కారణంగా చెట్లు విరిగిపడం, ఇళ్ల రేకులు ఎగిరిపోవడం జరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఆస్తి నష్టం పంట నష్టం కూడా జరిగింది. రానున్న 34 రోజుల పాటు ఈ ఎండల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. అందుకే ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ క్షేమంగా ఉండాలని సూచిస్తున్నారు.

# కోల్ గ్యాసిఫికేషన్ కు సింగరేణి రెడీ

(మొదటిపేజీ తరువాయి)

బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కోరారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్-3 తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబడినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్-3ను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## త్వరలో సంయుక్త సమావేశం

తాడిచెర్ల కోల్ బ్లాక్-3 అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీమైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తాడిచెర్ల కోల్ బ్లాక్-2 అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్-2కు ఎంఎండిఆర్ చట్టం, 1957లోని సెక్షన్-5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ అంశాలపై కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వండి

తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నిర్మలా సీతారామన్ తో భట్టి విక్రమార్క సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఏఎస్‌సీఐ కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం - విద్యా రంగ పెట్టుబడులకు ఎఫ్ ఆర్ బిఎం మినహాయింపు కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఫ్యూచర్ సిటీపై సీఎం ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి కోరుతామని తెలిపారు.

## జూన్‌లో శంఖుస్థాపనలు

జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమలకు శంకుస్థాపన జరిగేలా చూడాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భూములు కేటాయించిన వెంటనే నిర్మాణాలు మొదలు పెట్టాలనే నిబంధన విధించాలని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్, ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థని రూపొందించాలన్న రేవంత్ రెడ్డి గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు చెప్పారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని, నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచించారు. జీసీసీలు, డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రహదారుల సమీపంలోని ప్రభుత్వ భూములు గుర్తించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల ఏర్పాటు కోసం పాలసీ రూపొందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ 3 నెలల్లో టీఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## 1967 తర్వాత..

# తమిళనాడు కేబినెట్‌లో కాంగ్రెస్ మంత్రులు



**చెన్నై, మహా:** తమిళనాడు రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. దాదాపు 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ తమిళనాడు ప్రభుత్వంలో భాగస్వామి కాబోతోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు గురువారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ అధికారికంగా వెల్లడించారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత కే రాజేశ్ కుమార్, మరో ఎమ్మెల్యే పి విశ్వనాథన్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చెప్పారు. దశాబ్ద కాలానికి పైగా కాంగ్రెస్ డీఎంకేలో బలమైన మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ఎప్పుడూ ప్రభుత్వంలో భాగస్వామ్యం దక్కలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా పగ్గాలు చేపట్టిన విజయ్ కాంగ్రెస్‌కు రెండు మంత్రి పదవులు ఇచ్చారు. దీంతో 1967 తర్వాత మళ్లీ కాంగ్రెస్ తమిళనాడు కేబినెట్‌లో అడుగుపెట్టబోతోంది.

# ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి

## ఆర్బీఐ సంచలన నిర్ణయం.. రూ.96.68కి పడిపోవడంతో అలర్ట్

**ముంబై. మహా:** అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి చరిత్రలో ఎన్నడూ లేనంతగా అట్టడుగు స్థాయికి పడిపోయింది. ప్రస్తుతం ఒక డాలర్ విలువ ఏకంగా రూ.96.68కి క్షీణించడంతో దేశీయ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రూపాయి పతనానికి బ్రేకులు వేయడానికి మార్కెట్లో స్థిరత్వాన్ని తీసుకురావడానికి భారత కేంద్ర బ్యాంకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన నిర్ణయం తీసుకుంది. రూపాయి విలువను కాపాడేందుకు ఈనెల 26న భారీ ఎత్తున 'డాలర్‌రూపీ స్వాప్ ఆక్షన్' నిర్వహించనున్నట్లు ప్రకటించింది.



# కొత్త పార్టీ పెట్టే ప్రసక్తే లేదు

- చివరి శ్వాస వరకు బీజేపీతోనే
- కన్న కొడుకునే పోలీసులకు అప్పగించా
- కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, మహా:** తన చివరి శ్వాస వరకు భారతీయ జనతా పార్టీలోనే కొనసాగుతానని, ప్రాణం విడిచాక తన భౌతికకాయంపై బీజేపీ జెండానే కప్పాలన్నది తన ఆఖరి కోరిక అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాను కొత్త పార్టీ పెడుతున్నారంటూ వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. తన రక్తంలోనే బీజేపీ పట్ల అపారమైన ప్రేమ ఉందని, కొత్త పార్టీలు పెట్టే చిల్లర మల్లర రాజకీయాలు చేసే ఆలోచన తనకు ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. ఇటీవల తన కుమారుడి అరెస్ట్ వివాదం తర్వాత తొలిసారిగా నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయన.. సంచలన వ్యాఖ్యలు చేశారు. తన వ్యక్తిత్వం, నైతికత, నిజాయితీ ఏంటో తెలంగాణ ప్రజలందరికీ బాగా తెలుసని , సోషల్ మీడియా వేదికగా తన ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రత్యర్థులు కుట్రలు చేస్తున్నారన్నారు. తన రక్తంలోనే బీజేపీ సిద్ధాంతాల పట్ల అపారమైన ప్రేమ ఉందని, చివరి శ్వాస వరకు భారతీయ జనతా పార్టీలోనే కొనసాగుతానని బండి సంజయ్ స్పష్టం చేశారు. తనపై, పార్టీపై జరుగుతున్న ఈ దుష్ప్రచారానికి ప్రధాన సూత్రధారి కేటీఆరే అని ఆయన ఆరోపించారు. కేటీఆర్ ఒక 'ఫేక్ మీడియా ఫ్యాక్టరీ' నడుపుతున్నారని, పనిగట్టుకుని తనను డ్యామేజ్ చేసేందుకు పెయిడ్ బ్యాచ్‌తో సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో నాయకులు తమ కుటుంబ సభ్యులు తప్పు చేస్తే అధికార బలంతో వెనకేసుకురావడం చూస్తుంటామని, కానీ ఈ విషయంలో తన చరిత్ర పూర్తిగా విభిన్నమని బండి సంజయ్ గుర్తుచేశారు. తన కుమారుడికి సంబంధించిన ఒక వివాదం గురించి సమాచారం వచ్చిన వెంటనే, ఒక తండ్రిగా తన అధికారాన్ని ఉపయోగించి కాపాడే ప్రయత్నం చేయలేదని, కన్న కొడుకును స్వయంగా తీసుకెళ్లి పోలీసులకు అప్పగించిన నైతిక చరిత్ర కలిగిన నాయకుడిని తానేనని ఉద్ఘాటించారు. తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల అహంకారపూరిత కుటుంబ, గడీల పాలనకు చరమగీతం పాడింది బీజేపీయేనని, వారి కోటల గోడలను బద్దలు కొట్టింది తామేనని గుర్తు చేశారు. ఆ ఫ్రస్టేషన్, అక్కసుతోనే ఇప్పుడు తనపై వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని, తన అరెస్టు ప్రచారాల గురించి కోర్టులోనే అన్నీ తేలుతాయన్నారు.

# మరో ప్రయగ్ రాజ్.. త్రివేణి సంగమం

త్రివేణి సంగమం కాళేశ్వరం దివ్య క్షేత్రానికి సరస్వతి నది అంత్య పుష్కరాల శోభ సంతరించుకుంది.. మరో ప్రయాగ్ రాజ్ క్షేత్రంలా కాళేశ్వరం రూపుదిద్దుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి కాక వివిధ రాష్ట్రాలు దేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అంత్య పుష్కరాలకు తరలిరానున్నారు. దాదాపు 50 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. మంత్రి శ్రీధర్ బాబు పుష్కరాల సక్సెస్ కు ప్రత్యేక కృషి చేస్తున్నారు. దక్షిణ కాశీ కాళేశ్వరం క్షేత్రం సరస్వతి నది అంత్య పుష్కరాలకు ముస్తాబయింది. పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత తాత్కాలిక పనులను అధికార యంత్రం పూర్తి చేసింది. మేయిన్ ఘాట్ సరస్వతి ఘాట్ల విస్తరణతో పాటు గోదావరి ఒడ్డున నుంచి నీరు ఉన్న చోటుకు వెళ్లేందుకు తాత్కాలికంగా రోడ్లు నిర్మించారు. బుధవారం రాత్రి పుష్కరకాలం మొదలుకానుండగా గురువారం తెల్లవారుజామున 5:45 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి.. మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి అంత్య పుష్కరాలను ప్రారంభించనున్నారు. మొదటిరోజు గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పుష్కర స్నానం చేసి స్వామి వారిని దర్శించుకోనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు పుష్కరాలకు హాజరు కానున్నారు. ఉత్తర భారతంలో ప్రయాగ వద్ద దక్షిణాదిలో కాళేశ్వరం వద్ద మాత్రమే సరస్వతి పుష్కరాలు నిర్వహిస్తారు. గోదావరి ప్రాణహితల సంగమం కాళేశ్వరం వద్ద సరస్వతి నది అంతర్ వాహినిగా ప్రవహిస్తుంది. గత ఏడాది మేలో కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు వైభవంగా జరిగాయి. ఈ నెల 21 గురువారం నుంచి జూన్ 1 వరకు అంత్యపుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు



ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేపట్టింది. సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పుష్కరాల విజయవంతానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అంత్య పుష్కర కాలంలో పుష్కరుడు నదిలో శక్తివంతంగా కొలువై ఉంటాడని.. పురాణాల ప్రకారం ముక్కోటి దేవతలు సైతం పుష్కర సమయంలో నదిలో అంతర్వాహినిగా స్నానం ఆచరిస్తారని అర్చకులు చెబుతున్నారు. కాశీలో గంగా హారతి మాదిరిగానే కాశీ పండితులతో గోదావరి హారతి ప్రతిరోజు సాయంత్రం కొనసాగుతుంది. ఇందుకోసం తొమ్మిది గద్దెలను ప్రత్యేకంగా నిర్మించారు. 12 రోజుల పాటు నవరత్న హారతి ఇవ్వనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30 కోట్లతో పనులు చేపట్టింది. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అంతే పుష్కరాలకు 50 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. మహారాష్ట్ర చత్తీస్గఢ్ కర్ణాటక మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు. భక్తుల వాహనాల పార్కింగ్ కోసం దాదాపు 300 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు ట్రాఫిక్ నియంత్రణకు వన్ వే అమలు చేయనున్నారు. గోదావరిలో పడవలతో గజ ఈతగాళ్లు పహారా కాయనున్నారు. బస్టాండ్ నుంచి భక్తులను ఘాట్ల వద్దకు ఉచితంగా తరలించేందుకు మినీ బస్సులను ఏర్పాటు చేశారు. గోదావరి వద్ద భక్తులకు విఐపి లకు వేర్వేరు ఘాట్లను ఏర్పాటు చేశారు. రాష్ట్ర గవర్నర్ ప్రతాప్ శుక్ల సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు అంత్య పుష్కరాలకు హాజరుకానున్నారు.

పుష్కరాల్లో విద్యుత్ అంతరాయం రాకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. కాళేశ్వరంవిపుష్కరాల వద్ద 8, 9, 11 మీటర్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా సుమారు 5 కిలోమీటర్ల 11 కేవీ లైన్ 12 కిలోమీటర్ల ఎల్ టి లైన్ కొత్తగా వేశారు. 18 ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేశారు. 12 రోజులపాటు నిరంతరం విద్యుత్ సరఫరా కోసం నలుగురు డివిజన్ ఇంజనీర్లతో పాటు ఇంజనీర్లు లైఫ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. పారిశుధ్య నిర్వహణకు కోసం పది మంది జోనల్ ఆఫీసర్లు సెక్టార్ అధికారులు 38 మంది సూపర్వైజర్లు వందమంది మొత్తం 150 మందిని నియమించారు. ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సుమారు తాత్కాలికంగా 200 వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు పార్కింగ్ స్థలాలు దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఇతరత్రా సదుపాయాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. దాదాపు 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటన్నింటికీ అనుసంధానంగా స్థానికంగా కాళేశ్వరం పోలీస్ స్టేషన్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఆధునిక టెక్నాలజీ తో నాలుగు డ్రోన్లను వినియోగించనున్నారు. వీటి సహాయంతో నిరంతరం భక్తుల రద్దీ ట్రాఫిక్ పరిస్థితులను పర్యవేక్షించనున్నారు. రెండు రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచారు. దీనికోసం దాదాపు 50 మందిని నియమించారు.

మంథని నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వర క్షేత్రంలో సరస్వతి అంత్య పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వివిధ రాష్ట్రాలు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చే భక్త జనానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఇప్పటికే అధికారులకు సూచనలు చేశారు. గత సంవత్సరం జరిగిన పుష్కరాలు మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో సక్సెస్ ఫుల్ గా జరిగాయి. అదే స్ఫూర్తితో ప్రస్తుతం అంత్య పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో బ్రహ్మాండంగా నిర్వహించేందుకు మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. పుష్కరాల విజయవంతంలో తన ముద్ర చాటుకునేలా కృషి చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి కాళేశ్వర క్షేత్రం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కొద్ది రోజుల్లో కాళేశ్వర క్షేత్రం మహాద్భుత క్షేత్రంగా రూపుదిద్దుకోనుంది. మంత్రి చొరవ వల్ల క్షేత్రం రూపురేఖలే మారనున్నాయి. రాష్ట్రంలోనే ఒక ప్రముఖ పుణ్యక్షేత్రంగా మారనుంది. సరస్వతి ఘాట్ వద్ద భారీ వ్యయంతో భక్తులను ఆకట్టుకునే విధంగా భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల నుంచి కాళేశ్వరానికి దాదాపు నాలుగు వేల బస్ సర్వీసులను నడపనున్నారు. అదేవిధంగా పోలీస్ శాఖ 2500 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సరస్వతి ఘాటు వద్ద హారతుల వేదికను అందంగా ముస్తాబు చేశారు. కాశీ నుంచి వచ్చే పండితులు తొమ్మిది హారతులు చేపట్టనున్నారు. తెప్పోత్సవం నిర్వహణకు కాకినాడ నుంచి పడవను తెప్పించారు. పుష్కర ప్రారంభం నుంచి ముగింపు వరకు నిత్యం హోమ క్రతువు నిర్వహించనున్నారు.



- గొట్టిముక్కుల బ్రహ్మచారి
9441884389

## కుల గణన: సమానత్వ భారతానికి
# తొలి అడుగు

దేశ రాజకీయ, సామాజిక చర్చల్లో "కుల గణన" అంశం మరోసారి కేంద్ర బిందువుగా మారింది. జనగణనలో కుల వివరాలు కూడా నమోదు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయం ఈ చర్చకు కొత్త ఊపునిచ్చింది. దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం, సంక్షేమం, రిజర్వేషన్ల అమలుపై కొనసాగుతున్న సందేహాలకు ఇది కీలక మలుపుగా భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

భారత రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇస్తున్నప్పటికీ, సమాజంలోని వాస్తవ పరిస్థితులు మాత్రం ఇంకా అసమానతలనే ప్రతిబింబిస్తున్నాయి. విద్య, ఉపాధి, ఆదాయం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో అనేక వర్గాలు ఇప్పటికీ వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే, వారి స్థితిగతులపై ప్రభుత్వాల వద్ద ఖచ్చితమైన గణాంకాలే లేకపోవడం పెద్ద లోటుగా మారింది. ఫలితంగా సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, అవకాశాల పంపిణీ వంటి అంశాలు ఇప్పటికీ అంచనాల ఆధారంగానే కొనసాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

దేశంలో చివరిసారిగా సమగ్ర కుల గణన 1931లో జరిగింది. స్వాతంత్ర్యం తర్వాత షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన వివరాలు మాత్రమే అధికారిక జనగణనల్లో నమోదు అవుతున్నాయి. ఇతర వెనుకబడిన వర్గాల జనాభా, వారి విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం వంటి అంశాలపై సమగ్ర సమాచారం ఇప్పటికీ అందుబాటులో లేదు. కానీ రిజర్వేషన్ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలు మాత్రం ప్రధానంగా ఈ వర్గాలపైనే ఆధారపడి కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఖచ్చితమైన గణాంకాలు లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సమాజంలోని వాస్తవ అసమానతలను అర్థం చేసుకోకుండా సమానత్వాన్ని సాధించడం అసాధ్యమనే వాదనకు అవి బలం చేకూర్చాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి వర్గానికి తగిన ప్రాతినిధ్యం, సమాన అవకాశాలు కల్పించాలంటే ముందుగా వారి అసలు పరిస్థితి ఏమిటో తెలుసుకోవాల్సిందే. గణాంకాలు లేకుండా సంక్షేమ విధానాలు రూపొందించడం అంటే చీకట్లో బాణం వదిలినట్టేనని పాలన నిపుణులు పేర్కొంటున్నారు.

ఇటీవలి కాలంలో కుల గణన అంశాన్ని కొన్ని రాజకీయ పార్టీలు ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొస్తున్నాయి. వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై స్పష్టమైన సమాచారం సేకరించాలని అవి డిమాండ్ చేస్తున్నాయి. "దేశ సంపదలో, అధికార వ్యవస్థలో, విద్యా అవకాశాల్లో ఎవరికెంత భాగస్వామ్యం ఉంది?" అన్న ప్రశ్న ఇప్పుడు జాతీయ చర్చగా మారింది. సుప్రీంకోర్టు తాజా అభిప్రాయం ఈ డిమాండ్లకు మరింత బలం చేకూర్చింది.

ఈ విషయంలో తెలంగాణ దేశానికి ఒక నమూనాగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల సర్వే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో నిర్వహించిన ఈ సర్వే పారదర్శకత, శాస్త్రీయ విధానాల పరంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రతి వర్గానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్యా వివరాలను సమగ్రంగా సేకరించే ప్రయత్నం జరిగింది. ప్రజల్లో విశ్వాసం కలిగించేలా నిర్వహించిన ఈ ప్రక్రియ "డేటా ఆధారిత పరిపాలన"కు ఒక ఉదాహరణగా నిలిచింది.



ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ఇప్పుడు డేటా ఆధారిత విధానాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో కూడా వర్గాల వారీ గణాంకాలను సేకరించి లక్ష్యిత సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. భారతదేశం వంటి భిన్న సంస్కృతుల సమాజంలో ఈ అవసరం మరింత కీలకమవుతోంది.

అయితే కుల గణనపై అభ్యంతరాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇది సమాజంలో విభజనలను పెంచుతుందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుల రాజకీయాలు మరింత బలపడతాయన్న వాదనను కూడా వినిపిస్తున్నారు. కానీ అసమానతలను గుర్తించడం సమాజాన్ని విభజించడం కాదు. అవి ఎక్కడ ఉన్నాయో తెలుసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించడమే ప్రజాస్వామ్య బాధ్యత. వైద్యుడు వ్యాధిని గుర్తించకుండా చికిత్స చేయలేనట్టే, సమాజంలోని అసమానతలను అర్థం చేసుకోకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదు.

ఇక్కడ మరో కీలక అంశం డేటా భద్రత. వ్యక్తిగత సమాచారం సేకరణ విషయంలో ప్రజల్లో సహజంగానే ఆందోళనలు ఉంటాయి. అందువల్ల కుల గణన ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, శాస్త్రీయ ప్రమాణాలతో జరగాలి. సేకరించిన సమాచారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించకుండా కఠిన చట్టపరమైన రక్షణలు కల్పించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ యుగంలో గోప్యతా హక్కుల పరిరక్షణ అత్యంత కీలకం.

సుప్రీంకోర్టు వ్యాఖ్యల అనంతరం ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. కుల గణన అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా పరిపాలనా అవసరంగా చూడాలి. రాష్ట్రాల అనుభవాలు, సామాజిక శాస్త్ర నిపుణుల సూచనలు, సాంకేతిక సామర్థ్యాలను సమన్వయం చేస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించాలి. దేశ ప్రజలు కూడా అంచనాలకు అనుగుణంగా కాకుండా... వాస్తవ గణాంకాల ఆధారంగా సామాజిక న్యాయం అమలవాలని కోరుతున్నారు.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి కేవలం నినాదాలు సరిపోవు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, ఆధారాలతో కూడిన విధానాలను అమలు చేయాలి. సమగ్ర కుల గణన అనేది కేవలం పరిపాలనా కార్యక్రమం మాత్రమే కాదు... భారత ప్రజాస్వామ్యాన్ని మరింత సమానత్వ దిశగా తీసుకెళ్లే చారిత్రాత్మక సంస్కరణగా నిలవాల్సిన అవసరం ఉంది.



-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ

# ప్రపంచంలో ఎక్కువ నీటిని వినియోగిస్తున్నది ఈ దేశమే..?

మన ఇళ్లలో ఒక్క బకెట్ నీటిని కూడా జాగ్రత్తగా వాడే రోజులు వచ్చేశాయి. ఉదయం తాగునీటి కోసం క్యూల్లో నిలబడే పరిస్థితులు చాలా ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. కానీ ప్రపంచంలో కొన్ని దేశాలు మాత్రం లక్షల క్యూబిక్ అడుగుల నీటిని ఒక్క వ్యక్తికే వినియోగిస్తున్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. ముఖ్యంగా మధ్య ఆసియాలోని Turkmenistan పరిస్థితి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న మంచినీటిలో దాదాపు 70 శాతం కేవలం వ్యవసాయ రంగానికే వినియోగిస్తున్నారని తాజా నివేదికలు చెబుతున్నాయి. ఇందులోనూ కొన్ని దేశాలు అత్యధికంగా నీటిని వాడుతూ భవిష్యత్ తరాలకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



### ఒక్క వ్యక్తి వినియోగం చూసి ప్రపంచం షాక్..

వరల్డోమీటర్, ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు విడుదల చేసిన నివేదిక ప్రకారం, తుర్క్మెనిస్తాన్‌లో ఒక్క వ్యక్తి ఏడాదికి సగటున 1,28,000 క్యూబిక్ అడుగుల నీటిని వినియోగిస్తున్నాడు. ఈ సంఖ్య ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ జాబితాలో Montenegro రెండో స్థానంలో ఉండగా.. Uzbekistan, Guyana తదుపరి స్థానాల్లో ఉన్నాయి. అత్యంత అభివృద్ధి చెందిన United States కూడా అత్యధిక నీటి వినియోగ దేశాల్లో ఒకటిగా నిలవడం గమనార్హం.

### ఎడారి దేశం..

తుర్క్మెనిస్తాన్ ప్రధానంగా ఎడారులతో నిండిన దేశం. అక్కడ వర్షపాతం చాలా తక్కువ. అయినప్పటికీ పత్తి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. సోవియట్ పాలన కాలంలోనే అము దర్యా నది నుంచి భారీ కాలువలను తవ్వి, ఎడారి ప్రాంతాలకు నీటిని మళ్లించారు. వేల కిలోమీటర్ల పొడవున సాగిన ఈ కాలువలు వ్యవసాయ భూములకు జీవనాడిగా మారాయి. కానీ కాలక్రమేణా ఈ ప్రాజెక్టులే పర్యావరణానికి పెను ప్రమాదంగా మారాయి. పాతకాలపు నీటిపారుదల వ్యవస్థల్లో భారీ లీకేజీలు ఏర్పడి, పొలాలకు చేరకముందే కోట్ల లీటర్ల నీరు వృథా అవుతోంది. వ్యవసాయ అవసరాల కోసం నదుల నీటిని విపరీతంగా మళ్లించడం వల్ల మధ్య ఆసియాలోని ప్రసిద్ధ Aral Sea దాదాపు పూర్తిగా ఎండిపోయింది. ఒకప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద సరస్సుల్లో ఒకటిగా ఉన్న అరల్ సముద్రం, ఇప్పుడు ఎడారిలా మారిపోయింది. నీరు తగ్గిపోవడంతో అక్కడి చేపల పరిశ్రమ పూర్తిగా దెబ్బతింది. వాతావరణ మార్పులు తీవ్రరూపం దాల్చాయి. గాలిలో ఉప్పు, రసాయనాల మోతాదు పెరిగి ప్రజల ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడింది.

### వ్యవసాయం పేరుతో నీటి దుర్వినియోగం..

మధ్య ఆసియాలోని Kyrgyzstan, Tajikistan వంటి దేశాలు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి. పాతకాలపు సాగు పద్ధతులు, సరైన పర్యవేక్షణ లేకపోవడం, లీకేజీలు, నీటి వృథా కారణంగా ప్రతి సంవత్సరం కోట్లాది లీటర్ల నీరు నష్టపోతోంది. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కూడా భారీగా నీటిని వినియోగిస్తున్నాయి. తక్కువ జనాభా ఉన్న దేశాల్లో పారిశ్రామిక అవసరాలు అధికంగా ఉండటంతో తలసరి నీటి వినియోగం మరింత పెరుగుతోంది.

### తాగునీటి కోసం పోరాడుతున్న దేశాలు..

ఒకవైపు లక్షల లీటర్ల నీరు వృథా అవుతుండగా, మరోవైపు ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. Democratic Republic of the Congo వంటి ప్రాంతాల్లో ఒక వ్యక్తి రోజుకు కేవలం 32 లీటర్ల నీటితోనే జీవనం సాగిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది ప్రపంచంలో నీటి వినియోగంలో ఉన్న తీవ్రమైన అసమానతను స్పష్టం చేస్తోంది.

### భవిష్యత్తులో నీటి యుద్ధాలేనా?

నిపుణుల హెచ్చరికల ప్రకారం, ఇదే పరిస్థితి కొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. వాతావరణ మార్పులు, పెరుగుతున్న జనాభా, పరిశ్రమల విస్తరణ కారణంగా భవిష్యత్తులో నీటి కోసం దేశాల మధ్య ఘర్షణలు కూడా జరిగే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొన్ని నగరాల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి.

### పరిష్కారం ఏంటి?

నీటి సంక్షోభాన్ని నివారించాలంటే వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను వెంటనే అమలు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి నీటి పొదుపు విధానాలను విస్తృతంగా ప్రోత్సహించాలి. పాత కాలువలను మరమ్మతు చేసి, లీకేజీలను అరికట్టాలి. వర్షపు నీటిని నిల్వ చేసే ప్రణాళికలను ప్రతి దేశం తప్పనిసరిగా అమలు చేయాలి. ప్రజల్లో కూడా నీటి సంరక్షణపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

## డాలర్ జోరుతో సామాన్యుడి జేబుకు చిల్లు.. ఫోన్ల నుంచి కార్ల దాకా భారీగా పెరగనున్న ధరలు?

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం వల్ల దిగుమతి చేసుకున్న వస్తువులు, దేశీయంగా ఉత్పత్తి అయినా, విదేశాల నుంచి ముడిసరుకును ఆశ్రయించిన ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఉదాహరణకు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఆయిల్, గృహోపకరణాలకు ఉపయోగించే సెమీ కండక్టర్లు, ఇతర విడి భాగాలు అంతర్జాతీయ మార్కెట్లో డాలర్లలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. దీంతో కంపెనీలు ఈ అదనపు వ్యయాన్ని వినియోగదారులకు బదిలీ చేయక తప్పడం లేదు. స్మార్ట్‌ఫోన్‌ల విషయానికొస్తే, వీటి తయారీలో ఉపయోగించే చిప్‌సెట్‌లు, డిస్‌ప్లేలు, కెమెరా మాడ్యూల్స్ వంటి అనేక కీలక భాగాలను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటారు. డాలర్ బలోపేతం కావడంతో ఈ భాగాల దిగుమతి వ్యయం పెరుగుతుంది. తత్ఫలితంగా, కొత్త ఫోన్‌ల ధరలు పెరుగుతాయి. అలాగే, పాడైన ఫోన్‌లకు సరిచేయడానికి అవసరమైన విడిభాగాలకు కూడా ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది. ఆటోమొబైల్స్ రంగంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. కార్ల తయారీలో కీలకమైన కొన్ని భాగాలను విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. డాలర్ విలువ పెరిగినప్పుడు, ఈ దిగుమతులపై అయ్యే ఖర్చు రెట్టింపవుతుంది. దీంతో కార్ల ధరలు పెరిగి, మధ్యతరగతి ప్రజల కొనుగోలు సామర్థ్యం తగ్గుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా అంతర్జాతీయ చమురు ధరలపై ఆధారపడి ఉంటాయి, ఇవి డాలర్ విలువతో ముడిపడి ఉంటాయి కాబట్టి ఇంధన వ్యయం కూడా అధికమవుతుంది. ఈ పరిణామాలు మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ద్రవ్యోల్బణం, పెరిగిన ఖర్చుల కారణంగా జీవన వ్యయం పెరుగుతోంది. పొదుపు చేసుకునే అవకాశాలు తగ్గి, ఆర్థిక స్థిరత్వం పట్ల ఆందోళనలు పెరుగుతున్నాయి. ఒకవైపు ఆదాయాలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెరగకపోవడం, మరోవైపు నిత్యావసరాలు, విలాస వస్తువుల ధరలు ఎగబాకడంతో ద్రవ్యోల్బణం భారం తీవ్రమవుతుంది. మొత్తంగా, డాలర్ విలువ పెరుగుదల అనేది కేవలం ఆర్థిక నివేదికలకే పరిమితం కాకుండా, సామాన్య పౌరుడి రోజువారీ జీవితంపై, వారి కొనుగోలు నిర్ణయాలపై విస్తృత ప్రభావాన్ని చూపుతోంది.



## సమిష్టి కృషితో
# నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధిద్దాం..

- సింగరేణి లక్ష్య సాధనకు అంకితభావంతో పనిచేయాలి..
- మల్టీ డిపార్ట్మెంట్ బృందం కన్వీనర్ దుర్గం రామచందర్ పిలుపు..



**మణుగూరు, మహా :** సమిష్టి కృషి, రక్షణ ప్రమాణాలు, నాణ్యతతో కూడిన ఉత్పత్తి ద్వారా సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నిలపాలని మల్టీ డిపార్ట్మెంట్ బృందం కన్వీనర్, మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ పేర్కొన్నారు. ఏరియా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న మన సంస్థ - మన గని - మన బాధ్యత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కొండాపురం భూగర్భ గని, అనంతరం మణుగూరు ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించి ఉద్యోగులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 202627 సంవత్సరానికి సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో పాటు మణుగూరు ఏరియాకు కేటాయించిన 96.26 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సమిష్టిగా సాధించాలని పిలుపునిచ్చారు. సింగరేణి భూగర్భ గనుల్లో కొండాపురం గని ఉత్పత్తి, లాభాల పరంగా ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఆదర్శంగా నిలిచేలా ఉద్యోగులంతా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. బొగ్గు రంగంలో ప్రైవేటు సంస్థల పోటీ పెరుగుతోందని, తక్కువ ధరలకు బొగ్గు విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం పెరుగుతున్నందున భవిష్యత్తులో బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలున్నాయని, కొత్త గనుల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి పెంపు దిశగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏజీఎం ఐఈడీ సీహెచ్ రాంబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 202526 సంవత్సరంలో సంస్థ సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలతో పాటు 202627 లక్ష్యాలను వివరించారు. భూగర్భ, ఉపరితల గనుల్లో భారీ యంత్రాల వినియోగం, సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. వ్యాపారాభివృద్ధితో లాభాలు పెరిగి ఉద్యోగులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. అనంతరం ఫైనాన్స్ మేనేజర్ పి రమేశ్ మాట్లాడుతూ మణుగూరు ఓపెన్‌కాస్ట్, కొండాపురం భూగర్భ గనుల కోసం యాజమాన్యం వెచ్చిస్తున్న నిధులు, లాభనష్టాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బి శ్రీనివాస చారి, కొండాపురం ప్రాజెక్టు అధికారి వేణు మాధవ్, డీజీఎం క్వాలిటీ నాగ రమేశ్, కొండాపురం మేనేజర్ పి నరసింహారావు, కేపీయూజీ రక్షణాధికారి మధుబాబు, మణుగూరు ఓసీ ఇన్‌చార్జి మేనేజర్ నవీన్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు వి కృష్ణంరాజు, ఎస్కే అబ్దుల్ రావూఫ్, సంక్షేమ అధికారులు డి.నరేశ్, బి.సాయి మౌనిక, పిట్ కార్యదర్శులు, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# సంక్షేమం–సామాజిక కార్యక్రమాలకు ప్రాధాన్యం..

**ఎమ్మెల్యే పాయం పర్యటనల్లో...**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం మణుగూరు మండలంలో పలు సంక్షేమ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశం, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, నూతన వధూవరుల ఆశీర్వాదం, గ్రామ సమస్యలపై వినతిపత్రం స్వీకరణ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు.

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారికి శుభాకాంక్షలు..**

మణుగూరు మండలంలోని గాంధీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహంలో పాండ్ర వరలక్ష్మి కుటుంబం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, మైనారిటీ అధ్యక్షుడు రహీం పాషా, ఇప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, సమితి సింగారం సర్పంచ్ కల





బోయిన మాధవరావు, ఉపసర్పంచులు గాండ్ల సురేష్, గోరంట్ల కనకయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ దొబ్బల వెంకటప్పయ్య, ఎస్. గణేష్ రెడ్డి, తిరుమలేష్, కూచిపూడి బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**17 మందికి రూ.12 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు..**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పాయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల, టౌన్, మైనారిటీ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం..**

మణుగూరు గాంధీబొమ్మ సెంటర్‌లో గడదాసు కృష్ణ-రాణి దంపతుల కుమారుడు బాలకృష్ణ, మానస వివాహానంతరం వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతన వధూవరులు బాలకృష్ణ మానసలను ఆశీర్వదించారు. వధూవరులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవితాంతం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మల్లెల మడుగు సమస్యలపై వినతిపత్రం**

తాగునీరు, రహదారులు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తామన్న ఎమ్మెల్యే పాయం..అశ్వాపురం మండలం మల్లెల మడుగు గ్రామపంచాయతీకి చెందిన ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరు క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రామంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లెల మడుగు సర్పంచ్ మచ్చా నరసింహారావు, గ్రామ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సైడ్ డ్రైనేజీ కాలువ పనులను ప్రారంభించిన సర్పంచ్ బుల్లి

**కారేపల్లి, మహా:** సింగరేణి మండల పరిధిలోని వెంకట్యతండాలో మెయిన్ రోడ్డు సైడ్ డ్రైనేజీ కాలువ పనులను స్థానిక సర్పంచ్ బానోత్ బుల్లి బుధవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధులతో 350 మీటర్ల మేర కాలువ పనులను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగంగా విడతల వారీగా పనులను చేపడుతున్నట్లు తెలిపారు. వేసవి రీత్యా నీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక సిద్ధం చేసి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల ప్రారంభోత్సవ



కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బానోతు దేవుల నాయక్, ఉప సర్పంచ్ బానోత్ రమేష్, వార్డు సభ్యురాలు సంగీత, వాంకుడోత్ కిషన్, రవి తదితరులు పాల్గొన్నారు,

## సింగరేణి బీసీ లైజనింగ్ అధికారి శ్రీనివాసచారికి ఘన సన్మానం

**మణుగూరు, మహా :** మణుగూరు సింగరేణి ఏరియాలో బీసీ లైజనింగ్ అధికారిగా నియమితులైన ఏరియా ఎస్ఓ టు జీఎం బి శ్రీనివాసచారిని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘ నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి శ్రీనివాసచారి సేవలు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బీసీ నాయకులు



ఏఎం చారి, గుండ్ల వెంకటేశ్వర్లు, బుర్ర వెంకటేశ్వర్లు, సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, విప్పల సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ పాల్వంచ రాములు, ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, ఆర్ఎంపీ కళ్యాణ్, పాల్వంచ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హక్కుల కోసం
# పోరాటాలకు సిద్ధం కావాలి..

### తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక..

**మణుగూరు, మహా :** తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం మండల మహాసభ బుధవారం మణుగూరు మండల కేంద్రంలో నిర్వహించారు. మహాసభలో 9 మందితో కూడిన నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పిట్టల నాగమణి, కార్యదర్శిగా నైనారపు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కనితి సత్యనారాయణ, బండారి స్వరూప, సహాయ కార్యదర్శులుగా పొదుటూరి సునీత, పూసం కళ్యాణి బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా చీమల మల్లయ్య, కనకం సరిత, కొప్పుల మాధవి ఎన్నికయ్యారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ గ్రామాల వారీగా పర్యటించి వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలో ఉపాధి హామీ పనులు సక్రమంగా అమలు కావడం లేదని, చేసిన పనులకు కూలీలకు సమయానికి చెల్లింపులు జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూమిలేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు కల్పించే వరకు పోరాటాలు కొనసాగించాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి 200 రోజుల పని, రూ.600 కూలీ సాధించే వరకు విశ్రమించవద్దని



ఆయన పేర్కొన్నారు. అవసరమైతే భూ పోరాటాలు, ఇండ్ల స్థలాల కోసం ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎర్రజెండా ఎప్పుడూ పేద ప్రజల పక్షాన నిలుస్తుందని అన్నారు. జూన్ నెలలో మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి హక్కుల సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు నూతన కమిటీ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు పిట్టల నాగమణి, కార్యదర్శి నైనారపు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కనితి సత్యనారాయణ, బండారి స్వరూప, సహాయ కార్యదర్శులు పొదుటూరి సునీత, పూసం కళ్యాణి, కమిటీ సభ్యులు చీమల మల్లయ్య, కనకం సరిత, కొప్పుల మాధవి, మిడిదొడ్డి శ్రీదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా బీటీ రోడ్డు నిర్మాణం..

- మామూళ్ల మత్తులో అధికారులు..
- అక్షర మహిళా మండలి ఆరోపణ
- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని రాజీవ్ గాంధీ నగర్‌లో ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డు నాణ్యత లేకుండా ఉండటంతో ప్రజలు నవ్వుకుంటున్న పరిస్థితి నెలకొందని అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆరోపించారు. బుధవారం మహిళా మండలి సభ్యులతో కలిసి ఆమె రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితమే నిర్మించిన రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న విషయంపై ఆమె విమర్శించారు. కాంట్రాక్టర్ అత్యంత నాసిరకంగా పనులు నిర్వహించి గుట్టుచప్పుడు కాకుండా చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ఇంత దారుణంగా నిర్మించిన బీటీ రోడ్డును ఇప్పటివరకు చూడలేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అధికారులు ఉన్నట్టా.. లేనట్టా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం నాణ్యమైన రోడ్లు నిర్మించాలని ఆదేశాలు ఇస్తున్నప్పటికీ కొంతమంది కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని



ఆరోపించారు. కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి కొందరు అధికారులు అక్రమ సంపాదనపై దృష్టి పెట్టడంతోనే నాసిరకపు పనులు జరుగుతున్నాయని విమర్శించారు. లక్షల్లో జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజా ధనాన్ని కాపాడాల్సింది పోయి కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే రాజీవ్ గాంధీ నగర్‌లో నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యతలేని రోడ్డును పూర్తిగా తొలగించి మళ్లీ నాణ్యతతో నిర్మించాలన్నారు. లేకుంటే సంబంధిత శాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అక్షర మహిళా మండలి సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం శైలజ, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు..

- కేక్ కట్ చేసి సంబరాలు..
- రక్తదాన శిబిరం నిర్వహించిన అభిమానులు

**మణుగూరు, మహా :** సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం మణుగూరులో అభిమానులు ఘనంగా నిర్వహించారు. మణుగూరు సీతారామ సినిమా థియేటర్ ఆవరణలో అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీం తారక సభ్యులు రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించి సామాజిక సేవా స్ఫూర్తిని చాటారు. ఈ వేడుకల్లో పెంట్యాల వెంకటేష్, ప్రశాంత్, పవన్, పండు, సాయి, భరత్, కందిమల్ల సాయి, రాము, లోకేష్,



వెంకట్, నజీర్, అజయ్, దుర్గ ప్రసాద్, తోటకూర సాయికృష్ణ తదితర అభిమానులు పాల్గొని జూనియర్ ఎన్టీఆర్‌కు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల సందడితో థియేటర్ ఆవరణ సందడిగా మారింది.

## ఎన్ఎస్ యుఐ నియోజకవర్గం అధ్యక్షునిగా ఆయాన్ పటేల్

### ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రం అందజేత

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఎన్ఎస్ యుఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షునిగా ఆయాన్ పటేల్ నియామకం. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆయా మండల అధ్యక్షులను, మున్సిపల్ డివిజన్ల అధ్యక్ష కార్యదర్శుల నియామకాలు చేపట్టడం జరిగింది. అందులో భాగంగా బుధవారం ఎన్ఎస్యుఐ నియోజకవర్గం అధ్యక్షునిగా మహమ్మద్ అయాన్ పటేల్ను నియమిస్తూ, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అయాన్ పటేల్ కు ధ్రువపత్రం అందించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను శ్రద్ధతో సమర్థవంతంగా నెరవేరుస్తానని, నమ్మకాన్ని వమ్ము చేయనని అయాన్ పటేల్ అన్నారు.



## బెల్లంపల్లిలో ఆంటీ నార్కోటిక్స్ శాఖ ఆధ్వర్యంలో
# ఆకస్మిక తనిఖీలు

### మత్తు పదార్థాలు, గంజాయి నియంత్రణకై చర్యలు
### బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు

**బెల్లంపల్లి, మహా:** గంజాయి మత్తు పదార్థాల నియంత్రణ కై బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మంచిర్యాల నార్కోటిక్ టీమ్స్, నార్కోటిక్ స్నైపర్ డాగ్ స్క్వాడ్ బృందాలు బుధవారం ఆకస్మికంగా తనిఖీలను వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా బస్టాండ్ పరిసర ప్రాంతాలతో పాటు బైకు పార్కింగ్ ఆటో స్టాండ్ పట్టణంలోని హోటల్స్, పాన్ షాప్ లతో పాటు పలు ఆటో స్టాండ్ ప్రాంతాల్లోసోదాలు నిర్వహించారు .అనంతరం బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత గంజాయి తో పాటు మత్తు పదార్థాలను సేవించరాదని విక్రయాలు జరిపిన సేవించినా కఠిన చర్యలను పోలీసు శాఖ తీసుకుంటుందని హెచ్చరించారు. చిన్నపిల్లలకు మత్తు పదార్థాలను కలిగిన చాక్లెట్లను విక్రయించిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు సిగరెట్లు వంటి నిషేధిత పదార్థాలను ఎవరు



విక్రయించరాదని, యువత గంజాయి కి లోనై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని హితవు పలికారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరంతరం సోదాలు నిర్వహించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సిఐ శ్రీనివాస రావు పేర్కొన్నారు.

## వేసవికాలం వడదెబ్బను రక్షించుకోవడానికి
# తీసుకోవలసిన జాగ్రత్తలు

- ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున బయటికి రావద్దు
- తప్పనిసరి అయితేనే బయటికి వెళ్లాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశానుసారం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి, జిల్లా ప్రజలు వేసవి ఎండల నుండి రక్షించుకొనుటకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియా చేయడం జరిగినది. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా వుంది కావున ఉదయం 10 గంటలు దాటిందంటే సూర్యుడు భగభగ మండిపోతున్నాడు. ఈ వేడి మరియు వడగాలుల నుండి రక్షించుకోకుండా ఏమాత్రం అలసత్వం వహించిన ఆసుపత్రి పాలు కావడం లేదా ప్రాణాంతకం కావచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఎండ వేడి నుండి వడగాలుల నుండి రక్షించుకొనుటకు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు మరియు గర్భిణీ మహిళలు జాగ్రత్తగా ఉండాలి. ఎండ తీవ్రత మరియు వడగాలులు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరు వడగాలుల నుండి ఎండ వేడిమి నుండి రక్షించుకోవడం, తగు జాగ్రత్తలు పాటిస్తూ తమను తాము రక్షించుకోవడం అత్యంత అవసరం.

**తీసుకోవలసిన జాగ్రత్తలు....**

ప్రతిరోజు క్రమం తప్పకుండా ఎక్కువ నీరు తాగాలి. రోజుకు కనీసం నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలి... నీరు, పళ్ళ రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి...లేత వర్ణము తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి...పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.. శుభ్రంగా రెండు పూటలా స్నానం చేయాలి...మితంగా భోజనం చేయాలి... ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి...ఫ్యాన్ వేసి ఇంటిలో చల్లగా ఉంచుకోవాలి...బయట తిరిగి వచ్చిన వెంటనే కొద్దిసేపు నీడలో కూర్చోవాలి... దీంతో శరీరం చల్లబడంతో పాటు శరీరంలోని అవయవాలు కూడా చల్లబడుతాయి. ఎండలో తిరిగిన వారు కనీసం ఐదు నుంచి పది నిమిషాల పాటు నీడలో సేద తీరిన తర్వాత స్వచ్ఛమైన నీరు తాగాలి. బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. సూర్య రష్మి ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగకపోవడం మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే టోపీ, స్కార్ఫ్ వంటివి వాడాలి. వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లినప్పుడు వెంట త్రాగునీటి వాటర్ బాటిల్ తీసుకొని వెళ్ళాలి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ వేడిమి ఎక్కువగా ఉంటుంది కాబట్టి బయటకు వెళ్లకపోవడమే మంచిది. రోడ్లమీద లభించే చల్లని రంగు పానీయాలు తాగరాదు. మాంసాహారం తగ్గించాలి మద్యం సేవించరాదు. నలుపు దుస్తులు, మందంగా ఉన్న దుస్తులు ధరించరాదు.

**వడదెబ్బకు గురి అయిన వ్యక్తికి చేయాల్సిన ప్రథమ చికిత్స**

1. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలి.
2. చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు తుడుస్తూ ఉండాలి.
3. ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలేలా ఉంచాలి
4. ఉప్పు కలిపిన మజ్జిగ కానీ లేదా ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం కానీ త్రాగించాలి.
5. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదు.
6. వీలైనంత త్వరగా దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి, జిల్లా ప్రజలకు సూచించారు.

# అమరుల ఆశయాలు సాధించాలి

### అమరుల ఆశయ సాధన సమితి బస్సు యాత్రను విజయవంతం చేయాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ ఉద్యమకారులకు, అమరులకు, కళాకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అమరుల ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోరే సాయిరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మారోజు వీరన్న స్తూపం నుంచి గద్దర్ సమాధి వరకు చేపడుతున్న బస్సు యాత్ర, బుధవారం యాచారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా మాల్ లో ఏర్పాటు చేసిన బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. యాచారం మండల కేంద్రంలోని, చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. తెలంగాణ అమర వీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోరే సాయిరాం, తెలంగాణ ఆడబిడ్డల వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు వెలుగు వనిత, రాష్ట్ర కోశాధికారి మల్లోజు శ్రీనివాస చారి, పల్లె లింగన్న, సంస్కృత సారధి బుల్లెట్ వెంకన్న, తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి సలహాదారు తిలకమళ్ళ లింగయ్య, రాష్ట్ర కోశాధికారి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వరుకుప్పల కాలాస్త్రి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి బట్టు లింగం తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఉద్యమకారుల బస్సు యాత్ర ఇబ్రహీంపట్నానికి...**

అమరుల ఆశయ సాధన సమితి బస్సు యాత్ర ఆరో రోజు నేడు ఉదయం 7 గంటలకు, రంగారెడ్డి జిల్లా



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలోని, బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని, అంబేద్కర్ విగ్రహానికి, చెరువు కట్ట పైన ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించడం జరుగుతుంది. 11 గంటలకు మలిదశ ఉద్యమకారుడు ఎల్బీనగర్ లో ఉన్న శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరుగుతుంది. ఓల్డ్ ఆల్వాల్ భూదేవి నగర్ వెంకటాపూర్ మహాబోధి పాఠశాలలో గద్దర్ సమాధి దగ్గర నివాళులర్పించి, అనంతరం ముగింపు సభ ఉంటుంది. ఈ యొక్క అమరుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న బస్సు యాత్రకు సహకరించి విజయవంతం చేయాలని ఉద్యమకారులను కోరారు.

## ఈనెల 23న వేద పాఠశాల శంకుస్థాపనకు రానున్న
# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

**యాదాద్రి భువనగిరి, మహా:** ఈ నెల 23వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామి క్షేత్రంలో టెంపుల్ సిటీ వద్ద వేద పాఠశాల శంకుస్థాపనకు విచ్చేస్తున్న సందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, అదనపు ఎస్పిలక్ష్మీనారాయణ, జిల్లా స్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఇ ఇ అర్ అండ్ బి, ఎస్సీ ఇరిగేషన్, ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పంచాయితీ, ఈ ఈ పంచాయతీ రాజ్, వైద్య శాఖ, ట్రాన్స్ కో, హార్టికల్చర్ డిపిఆర్ఓ, సివిల్ సప్లై, ట్రాఫిక్ తదితర శాఖల ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు అధికారులు సంపూర్ణ సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా పనులు పూర్తి చేయాలన్నారు. వేదిక వద్ద అన్ని ఏర్పాట్లుచేయాలని టెంపుల్ ఈ ఈ కోరారు. టెంపుల్ సిటీ వద్ద హెలిప్యాడ్ అన్ని ఏర్పాట్లుచేయాలని ఆర్ అండ్ బి అధికారులను, భద్రత ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తును, భారీ కేడింగ్ పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను, అగ్నిమాపక పరికరాలను , సేవలను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖను, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖను, రోడ్ల మరమ్మత్తుల పనులను అర్.అండ్.బి , అధికారులు , శానిటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, మున్సిపాలిటీ, జిల్లా పంచాయితీ శాఖ, ఈ ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పని చేయాలన్నారు. వేద పాఠశాల వద్ద శంకుస్థాపన కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షులకు నియామక పత్రాలు

## డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్య



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని మండలాలు, పట్టణాలకు సంబంధించిన నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షుల నియామక పత్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే జిల్లా డిసిసి అధ్యక్షులు బీర్ల అయిలయ్య బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాలకు కొత్త మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులను నియమించి వారికి అధికారిక నియామక పత్రాలను అందించారు. ఆలేరు పట్టణానికి చెందిన సముద్రాల సత్యనారాయణను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. నూతనంగా నియమితులైన వారిలో బొమ్మలరామారం మండల అధ్యక్షునిగా చీర సత్యనారాయణ, తుర్కపల్లి మండల అధ్యక్షునిగా దిరావత్ శంకర్ నాయక్, రాజపేట మండల అధ్యక్షునిగా బూడిద పెంటయ్య, యాదగిరిగుట్ట మండల అధ్యక్షునిగా మంగ సత్యనారాయణ, యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షునిగా ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, ఆలేరు మండల అధ్యక్షునిగా గంధమల్ల అశోక్, మోటకొండూరు మండల అధ్యక్షునిగా గంగాపురం మల్లేష్, గుండాల మండల అధ్యక్షునిగా ఇమ్మిడి దశరథ గుప్తా, ఆత్మకూరు మండల అధ్యక్షునిగా కందడి అనంతరెడ్డి, ఆలేరు పట్టణ అధ్యక్షునిగా కట్టేగొమ్ముల సాగర్ రెడ్డిలను నియమించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, పార్టీ బలోపేతం లక్ష్యంగా నూతనంగా నియమితులైన మండల, పట్టణ కమిటీలు సమిష్టి భావంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాయకులు పనిచేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసే బాధ్యత పార్టీ నాయకులు మరియు కార్యకర్తలపై ఉందన్నారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు చూపడంలో కమిటీ సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ ఆశయాలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేసి, ఆలేరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.అలాగే నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు ఆడెపు సంజీవరెడ్డిలు వున్నారు.

# స్వయంకృషితో పైకి వచ్చిన నాయకుడు డాక్టర్ చిలుకు స్వామి

## మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి




**యాదాద్రి భువనగిరి, మహా:** దేవతలందరి ఆశీర్వాదం రాష్ట్రశ్రమశక్తి అవార్డు గ్రహీత డాక్టర్ చిలుకు స్వామికి ఉండాలని మాజీ ప్రభుత్వ విప్ మాజీ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు... యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షారాజీపేట గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి డాక్టర్ చిలుకు స్వామికి రాష్ట్ర శ్రమ శక్తి అవార్డు లభించడంతో బుధవారం కొల్లూరు పరిధిలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్ లో పౌర సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ప్రభుత్వ విప్ ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి దంపతులు హాజరయ్యి డాక్టర్ స్వామిని ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా గొంగిడి సునీత మాట్లాడుతూ ప్రతి మగాడి విజయం వెనుక ఆడది ఉంటుందని స్వామి విజయం వెనుక ఆయన భార్య ఉందని గుర్తు చేశారు.. చిన్ననాటి నుండి ఎన్నో కష్టనష్టాలు ఓర్చు స్వయంకృషితో పైకొచ్చిన నాయకుడు స్వామి అన్నారు. స్వామికి శ్రమశక్తి అవార్డు రావడం చాలా గొప్ప విషయమని ఆమె కొనియాడారు పౌర సన్మానానికి ముందు షారాజీపేటలో డప్పు, డోలు, కోలాటం,నృత్య కళాకారులచే పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సమీపం వద్ద అంబేద్కర్ విగ్రహానికి డాక్టర్ చిలుకు స్వామి తో సహా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి,



# కుర్చీ తాత ఇకలేరు

- భార్య ఒడిలో తలవాల్చి శాశ్వత నిద్రలోకి...
- కన్నీరు పెట్టిస్తున్న కుర్చీ తాత తుది మజిలీ!

**హైదరాబాద్, మహా:** సామాజిక మాధ్యమాల్లో ఒకే ఒక్క డైలాగ్‌తో కోట్లాది మందిని ఆకర్షించి, రాత్రికి రాత్రే స్టార్‌గా మారిన 'కుర్చీ తాత' అలియాస్ షేక్ అహ్మద్ పాషా (కాలా పాషా) జీవితం అత్యంత విషాదాంతంగా ముగిసింది. "కుర్చీ మడతపెట్టి.." అంటూ ఆయన చెప్పిన డైలాగ్ ఇంటర్నెట్ ప్రపంచాన్ని ఎంతగా ఊపేసిందో.. నేడు ఆయన హఠాన్మరణం వార్త నెటిజన్లను అంతగానో కలచివేస్తోంది. ఎప్పుడూ తనదైన మాస్ శైలిలో, బిగ్గరగా అరుస్తూ అందరినీ నవ్వించిన ఆ గొంతు ఇక శాశ్వతంగా మూగబోయింది. ఆయన బయటకు కనిపించినంత ఉల్లాసంగా ఆయన నిజ జీవితం లేదని, ఆ నవ్వుల వెనుక ఒక ఒంటరి పోరాటం, కుటుంబ బాంధవ్యాల దూరం దాగి ఉన్నాయన్న వాస్తవం ఇప్పుడు అందరి హృదయాలను బరువెక్కిస్తోంది. గతంలో పలుమార్లు ఆయన చనిపోయారంటూ సోషల్ మీడియాలో వదంతులు వచ్చినప్పుడు నవ్వుతూ కొట్టిపారేసిన కుర్చీ తాత.. ఈసారి మాత్రం నిజంగానే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.విధి ఎంత విచిత్రమైనదంటే.. ఏ పార్కు పరిసరాల్లో అయితే ఆయన తన కాలమంతా గడిపారో, అదే పార్కు ఆయనకు ఆఖరి ప్రయాణానికి వేదికైంది. బుధవారం సాయంత్రం సుమారు ఐదు గంటల సమయంలో హైదరాబాద్ యూసుఫ్‌గూడ సమీపంలోని కృష్ణకాంత్ పార్కులో వాకింగ్ చేస్తున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. బయట మండిపోతున్న ఎండల తీవ్రతకు ఆయన శరీరం తట్టుకోలేకపోయింది. నడుస్తుండగానే వడదెబ్బ తగలడంతో పాటు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో, సొమ్మసిల్లి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఇది గమనించిన స్థానికులు, ఆయనను వెంటనే ఇంటికి చేర్చారు. అప్పటిదాకా కుటుంబానికి దూరంగా, పార్కుల చుట్టూ ఒంటరిగా తిరిగిన ఆ వృద్ధుడు.. తన తుది శ్వాస విడిచే సమయానికి మాత్రం కన్నవారి చెంతకు చేరాడు. ఇంటికి చేరుకున్న కొద్ది క్షణాల్లోనే, తన భార్య ఒడిలో తలపెట్టి ప్రాణాలు వదిలాడు. భర్త ఆకస్మిక మరణంతో ఆ ఇల్లాలు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.కుర్చీ తాత (అహ్మద్ పాషా)కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సోషల్ మీడియాలో ఎంతో ఫేమస్ అయినప్పటికీ, కొన్ని కుటుంబ కలహాలు, మనస్పర్థల కారణంగా ఆయన గత కొంతకాలంగా ఇంటికి దూరంగా ఉంటున్నారు. ఎండనక, వాననక రోడ్లపై, కృష్ణకాంత్ పార్క్ పరిసరాల్లోనే ఒంటరిగా తిరుగుతూ కాలం వెళ్లదీసేవారు. ఆయనలో ఒక ఆవేశం కనిపించినా, లోపల మాత్రం కుటుంబానికి దూరమయ్యానన్న బాధ ఎప్పుడూ ఉండేదని స్థానికులు చెబుతుంటారు. గతంలో ఆయన కనబడకుండా పోయినప్పుడు ఆయన భార్య మీడియా ముందుకు వచ్చి కన్నీళ్లు పెట్టుకోవడం వారి మధ్య ఉన్న ఆత్మీయ బంధానికి నిదర్శనం. చివరికి విధి కూడా ఆయన పట్ల కనికరించిందేమో.. ప్రాణాలు గాలిలో కలిసే ఆఖరి ఘడియల్లో ఆయన ఒంటరిగా కాకుండా, ఏ భార్యకైతే దూరంగా ఉన్నాడో అదే భార్య ఒడిలో తలపెట్టి ప్రశాంతంగా కన్నుమూశారు. నెట్టింట్లో మీమ్స్ ద్వారా కోట్లాది మంది ముఖాల్లో నవ్వులు పూయించిన ఆ వృద్ధుడి కథ.. ఇలా ఒక కన్నీటి కావ్యంగా ముగియడం తీవ్ర విషాదాన్ని నింపింది.

### కుక్కల గూడూరులో ఆయిల్ పామ్ సాగులో సరికొత్త మైలురాయి..

# మొదటి పంట కోతతో రైతుల ఆనందం

**పాలకుర్తి:** పాలకుర్తి మండలం, కుక్కల గూడూరు గ్రామంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతు బొడ్డు మొగిలి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం మొదటి పంట కోతను ఘనంగా నిర్వహించారు. 2022 23 సంవత్సరంలో నాటిన ఈ ఆయిల్ పామ్ తోట, మూడేళ్లు పూర్తి చేసుకుని తొలి కాపుకు రావడం పట్ల గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు బొడ్డు మొగిలిని గ్రామ సర్పంచ్ మేడం దేవమ్మ బాపు, ఉప సర్పంచ్ పోతరాజుల సంతోష్ శాలువాతో సన్మానించారు.

**ఆయిల్ పామ్ సాగుతో రెట్టింపు ఆదాయం**

ఈ సందర్భంగా సర్పంచ్ మేడం దేవమ్మ బాపు మాట్లాడుతూ, సంప్రదాయ పంటలకు భిన్నంగా ఆయిల్ పామ్ సాగు చేయడం వల్ల రైతులకు ఆదాయం రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ పోతరాజుల సంతోష్ మాట్లాడుతూ, ప్రస్తుతం మార్కెట్ లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ పంట వైపు రైతులు మొగ్గు చూపాలని, ఇది దీర్ఘకాలికంగా స్థిరమైన



ఆదాయాన్ని అందించే ఏకైక పంట అని వివరించారు. వ్యవసాయ అధికారి AO బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో 3 నుండి 4 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయవచ్చు. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు పొందవచ్చు అని రైతులకు అవగాహన కల్పించారు. దీని సాగుకు ప్రభుత్వం గరిష్ట రాయితీలను కూడా అందిస్తోందని, మండలంలోని ఇతర రైతులు కూడా ఆయిల్ పామ్ వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ ఆఫీసర్ టి. ప్రశాంత్‌తో పాటు స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జెల్లెల పెంటయ్య, కొండమడుగు నర్సింహ్మా ఎన్నిక

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో 18,19 తేదీలలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలో 33 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నారు . జిల్లా అధ్యక్షులుగా జెల్లెల్ల పెంటయ్య , ప్రధాన కార్యదర్శిగా కొండమడుగు నర్సింహ్మా జిల్లా ఉపాధ్యక్షులు సిరిపంగి స్వామి, గుంటోజీ శ్రీనివాస్ చారి, రాచకొండ రాములమ్మ , సల్లురి కుమార్ సహాయ కార్యదర్శులుగా బొల్లు యాదగిరి, గంగాదేవి సైదులు, పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌల్, కూకుట్ల చొక్కాకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా ఒక ప్రకటన ద్వారా జిల్లా మూడవ మహాసభలకు ఆతిథ్యమిచ్చి జయప్రదం చేసిన రామన్నపేట మండల కమిటీకి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ మహాసభ



లకు జిల్లా వ్యాప్తంగా 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారని ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని, కనీస వేతనాలు చట్టము అమలు చేసి వ్యవసాయ కూలీలకు రోజు కూలీ 800 రూపాయలు ఇవ్వాలి, జిల్లాలో ప్రాజెక్టుల కింద, కాలువల కింద, త్రిబుల్ ఆర్ రోడ్ లో భూములు కోల్పోతున్న రైతులతో పాటు భూముల మీద ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీలకు కూడా 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, విబిజి రాంజీ చట్టాన్ని రద్దుచేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి హామీలో ఈ కేవైసీ విధానాన్ని రద్దుచేసి పని ప్రదేశంలో కార్మికులకు తాగడానికి నీళ్లు, నీడ కోసం టెంట్ , మెడికల్ కిట్టు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు భూమిలేని పేదలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు, మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయలు, పెన్షన్లు పెంపు, ఇండ్లు, ఇళ్ల స్థలాలు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పథకం పేరుతో దళితులకు ఇస్తానన్న దళిత 12 లక్షల రూపాయలు ఇవ్వాలని, విద్యా, వైద్యం పేదలందరికీ ఉచితంగా అందించాలని, దళిత వాడలు, గిరిజన తండాలు, కూలీ పేటల అభివృద్ధి ప్రత్యేక నిధులు కేటాయించాలని తీర్మానాలు చేయడం జరిగిందని, ప్రభుత్వం వీటిని అమలు చేయకుంటే పోరాటాలు కొనసాగిస్తామని నర్సింహ తెలిపారు.



# సాగు, ఉత్పత్తి పెరిగింది

- సన్ ఫ్లవర్ మద్దతు ధర పెంచండి
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కోరిన ఎంపీ రఘునందన్ రావు

**హైదరాబాద్, మహా :** ఈ యాసంగిలో పండిన పొద్దుతిరుగుడు పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మెదక్ ఎంపీ రఘునందన్ రావు వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణలో పొద్దుతిరుగుడు పంట 21091 ఎకరాల నుంచి 27,675 ఎకరాలకు పెరిగిందని, పంట ఉత్పతి కూడా 13935 మెట్రిక్ టన్నుల నుంచి 19373 మెట్రిక్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. పొద్దు తిరుగుడు పంటకు కేవలం రూ. 5376 రూపాయల ధర మాత్రమే పలుకుందని, కనీస మద్దతు ధర 7721 వచ్చే విధంగా చూడలాని విజ్ఞప్తి చేశారు. మెదక్ నియోజకవర్గ పరిధిలోని గజ్వేల్, సిద్దిపేట, మెదక్ ప్రాంతాలలో పంట మార్పిడిలో భాగంగా యాసంగి లో పొద్దు తిరుగుడు పంట ఎక్కువగా పండిస్తున్నారు. దయచేసి వెంటనే పంట పూర్తిగా మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా సంబంధిత శాఖలకు సూచించాలంటూ విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ ఆహారాన్ని మించింది ఏముంది!

## కల్తీ లేదు.. కార్బైడ్ లేదు'.. కుప్పం ప్రజల మనసుల్లాంటి ముంజలు

## సామాన్యుల్లా రోడ్డు పక్కన ఆగి..

## తాటి ముంజలు ఆస్వాదించిన సీఎం చంద్రబాబు దంపతులు



**కుప్పం, మహా:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి తమ కుప్పం పర్యటనలో భాగంగా ఎంతో సాదాసీదాగా కనిపించి అందరి మనసులను గెలుచుకున్నారు. రాజకీయ కార్యక్రమాలు, బిజీ షెడ్యూళ్ల మధ్య కాసేపు పల్లెటూరి స్వచ్ఛతను ఆస్వాదించారు. ప్రయాణ మార్గంలో రోడ్డు పక్కన తాటి ముంజలు (ఐస్ ఆపిల్స్) విక్రయిస్తున్న వారిని గమనించిన ముఖ్యమంత్రి దంపతులు, తమ కాన్వాయ్‌ని ఆపి ముంజలను కొనుగోలు చేసి ఆస్వాదించారు. సామాన్య ప్రజలతో మమేకమై రోడ్డు పక్కన నిలబడి వేసవి తాపాన్ని తీర్చే చల్లటి ముంజలు తింటూ వారు సందడి చేశారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తన ఆనందాన్ని వ్యక్తపరుస్తూ.. గ్రామీణ ఆహార ఉత్పత్తుల పట్ల తనకున్న మక్కువను చాటుకున్నారు. "కల్తీ లేదు.. కార్బైడ్ లేదు.. పురుగు మందుల గోల అసలే లేదు.. మా కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటి ముంజలు రోడ్డు పక్కన ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది. మన గ్రామీణ ఆహార ఉత్పత్తులను మించింది ఏముంటుంది!" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రసాయనాలు వినియోగించి పండించే హైబ్రిడ్ పండ్ల కంటే, ప్రకృతి సిద్ధంగా లభించే పల్లెటూరి ఉత్పత్తులు ఎంతో శ్రేష్ఠమైనవని ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ ఏమాత్రం ఆర్భాటం లేకుండా సతీమణి భువనేశ్వరితో కలిసి ఇలా రోడ్డు పక్కన గ్రామీణ వాతావరణాన్ని ఆస్వాదించిన తీరు స్థానికులను ఎంతగానో అలరించింది. ఒకవైపు పల్లె ప్రజల ఆహారపు అలవాట్లను ప్రోత్సహిస్తూనే, మరోవైపు కుప్పం ప్రజల నిష్కల్మషమైన మనసులను స్వచ్ఛమైన ముంజలతో పోలుస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. అధినేత దంపతులు ఇలా సామాన్యుల్లా పల్లె ప్రకృతిని ఆస్వాదించడం, గీత కార్మికుల శ్రమను ప్రశంసించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# సీఎంగా రఘునందన్ రావు

- పోసాని సినిమాలో నటించిన బీజేపీ ఎంపీ
- ఆపరేషన్ అరుణారెడ్డి సినిమాలో వకీల్ సాబ్
- వెల్లడించిన నయుడు, డైరెక్టర్ పోసాని కృష్ణమురళి



**హైదరాబాద్, మహా :** రాజకీయాల్లోకి వచ్చిన నటుడు కమ్ డైరెక్టర్ పోసాని కృష్ణమురళి మళ్లీ సినిమాల్లో బిజీ అయ్యారు. ఆపరేషన్ అరుణారెడ్డి పేరుతో కొత్తగా సినిమా తీశారు.. ఈ మూవీలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కూడా నటించారని పోసాని తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు చెప్పారు. తన సినిమాలో ఎంపీ రఘునందనరావు ముఖ్యమంత్రి క్యారెక్టర్ చేశారని, ఆయన ఫేస్‌లో మంచి ఇంప్రెషన్ ఉందని గుర్తించి క్యారెక్టర్ చేయమని అడిగానన్నారు. రఘునందన్ రావు అంటే తనకు చాలా ఇష్టమని.. ఆయనకు తానంటే ఎంతో అభిమానం ఉందన్నారు. ఈ సినిమాలో సీఎం పాత్ర ఆయన చేస్తే బాగుంటుందని అనిపించిందన్నారు. తానే వచ్చి కథ చెబుతానంటే వద్దని చెప్పి రఘునందనరావు తన ఇంటికి వచ్చినట్లు పోసాని చెప్పారు. తన ఇంటికి వచ్చిన రఘునందనరావుకు కథ చెప్పానని, సినిమా బావుందని చెప్పి ముఖ్యమంత్రి క్యారెక్ట్ చేశారన్నారు. రఘునందన్ రావు బాగా చదువుకున్నారు, మంచి నాలెడ్జ్ ఉన్న వ్యక్తి, సినిమాలో కూడా బాగా చేశారన్నారు. తాను షూటింగ్ సమయంలో క్యారెక్టర్ ఓన్ చేసుకోమని మాత్రమే చెప్పానన్నారు. తన కథ గురించి చెప్పి ఆయన్ను నటించేందుకు ఒప్పించానన్నారు. ఎంపీ రఘునందన్ రావు ముఖ్యమంత్రి పాత్రలో ఒక నిజాయితీ గల జర్నలిస్టుకు అండగా నిలుస్తారన్నారు.

**సినిమాల నుంచి గ్యాప్ తీసుకోలేదు**

తాను సినిమాల నుంచి గ్యాప్ తీసుకోలేదని, అవకాశం దొరికితే దర్శకత్వంతో పాటుగా మంచి క్యారెక్టర్ ఉంటే నటిస్తానని పోసాని అన్నారు. రాజమౌళి సినిమా, సినిమాకు గ్యాప్ ఇస్తారని.. అలాగని ఇండస్ట్రీకి దూరమైనట్లు కాదుగా అన్నారు. తన ఆపరేషన్ అరుణారెడ్డి సినిమా అందరికి కచ్చితంగా నచ్చుతుందన్నారు. ఈ సినిమా ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, ఎవరైనా చక్కగా చూడొచ్చన్నారు. ప్రజలు నేతల్ని ఎన్నుకునే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ సినిమా ద్వారా చెప్పే ప్రయత్నం చేశామన్నారు. తనకు ఉన్న అనుభవంతో ఈ సినిమాను చాలా చక్కగా తెరకెక్కించినట్లు తెలిపారు. ఈ సినిమా ద్వారా జర్నలిస్టులు నిజాయితీగా ఉంటే సమాజం ఎంత బావుంటుందో చెప్పే ప్రయత్నం చేశానన్నారు.

# దేశం ఆర్థికంగా చితికిపోతుంటే మోదీ ఇటలీలో చాక్లెట్లు పంచుతున్నారు

## ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శ

**మహా :** ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీ పర్యటనలో ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనికి 'మెలోడీ' చాక్లెట్లు బహుకరించడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే, ప్రధాని విదేశాల్లో 'రీల్స్' చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం తన పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో జరిగిన 'బహుజన్ స్వాభిమాన్ సభ'లో పాల్గొన్న రాహుల్ గాంధీ, ప్రధాని వైఖరిపై ధ్వజమెత్తారు. దేశంలో సామాన్యుడు ధరల భారంతో విలవిల్లాడుతుంటే, ప్రధాని మాత్రం విదేశాల్లో చాక్లెట్లు పంపిణీ చేస్తూ హాస్యాస్పదంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**'మెలోడీ' గిఫ్ట్.. రాహుల్ సెటైర్**

ఇటలీ ప్రధాని మెలోని ఇటీవల సోషల్ మీడియాలో ఒక వీడియో షేర్ చేశారు. అందులో ప్రధాని మోదీ తమకు 'మెలోడీ' చాక్లెట్లను బహుమతిగా ఇచ్చారని ఆమె సరదాగా పేర్కొన్నారు. ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో, దీనిని రాహుల్ గాంధీ తప్పుబట్టారు. "దేశంలో ఆర్థిక తుపాను చెలరేగుతోంది. రైతులు, యువత, మహిళలు, కార్మికులు కన్నీరు పెడుతున్నారు. కానీ ప్రధాని మాత్రం ఇటలీలో చాక్లెట్లు పంచుతూ రీల్స్ చేయడంలో బిజీగా ఉన్నారు. బీజేపీ నాయకులు చప్పట్లు కొడుతున్నారు. ఇది నాయకత్వం కాదు, ఒక



ప్రహసనం" అని రాహుల్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఎద్దేవా చేశారు. దేశం త్వరలో భారీ ఆర్థిక గండం ఎదుర్కోబోతోందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. ముఖ్యంగా ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని, బంగారం కొనుగోళ్లను ఆపాలని, విదేశీ ప్రయాణాలు చేయవద్దని ప్రధాని మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేయడంపై రాహుల్ స్పందించారు. ప్రజలను విదేశాలకు వెళ్లొద్దని చెప్పిన ప్రధాని, మరుసటి రోజే ఐదు దేశాల పర్యటనకు వెళ్లారు. రాబోయే రోజుల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ మరియు నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకబోతున్నాయి. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి ప్రధాని మాటలే నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు. దేశంలోని చిన్న వ్యాపారులు, సామాన్యులు గడ్డు పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# పాక్ స్మగ్లర్ల కుట్ర భగ్నం

## సరిహద్దుల్లో డ్రోన్‌తో హెరాయిన్ డ్రాప్.. భారీగా మత్తుపదార్థాల స్వాధీనం.. అప్రమత్తమైన భద్రతా దళాలు.

**అమృత్‌సర్,మహా.** సరిహద్దుల్లో పాకిస్థాన్ స్మగ్లర్ల ఆగడాలకు భారత భద్రతా దళాలు మరోసారి చెక్ పెట్టాయి. డ్రోన్ల ద్వారా భారత భూభాగంలోకి మాదక ద్రవ్యాలను సరఫరా చేయాలన్న పాక్ కుట్రను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్), పంజాబ్ పోలీసులు సంయుక్తంగా సమర్థవంతంగా తిప్పికొట్టారు. తాజాగా బహదూర్‌పూర్ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ పొలాల్లో డ్రోన్ ద్వారా జారవిడిచిన హెరాయిన్ ప్యాకెట్లను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దేశంలోకి డ్రగ్స్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు పాక్ ముఠాలు చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఘటన తాజా ఉదాహరణగా నిలిచింది.రాత్రి సమయంలో సరిహద్దు వెంబడి అనుమానాస్పదంగా డ్రోన్ శబ్దాలు రావడాన్ని పసిగట్టిన భద్రతా దళాలు తక్షణం అప్రమత్తమయ్యాయి. డ్రోన్ కదలికలను గమనించిన వెంటనే ఆ ప్రాం



తాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ గాలింపు చర్యల్లో భాగంగా బహదూర్‌పూర్ గ్రామ సమీపంలో పసుపు రంగు టేపుతో చుట్టి ఉన్న ప్యాకెట్లను అధికారులు కనుగొన్నారు. పాకిస్థాన్ వైపు నుంచి వచ్చిన డ్రోన్ ఈ మత్తు పదార్థాలను భారత భూభాగంలో జారవిడిచినట్లు అధికారులు అధికారికంగా నిర్ధారించారు. పంజాబ్ పోలీసుల సహకారంతో బీఎస్ఎఫ్ జవాన్లు ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.సరిహద్దుల్లో దట్టమైన పొగమంచు, చీకటిని ఆసరాగా చేసుకుని పాక్ స్మగ్లర్లు తరచూ ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని, అయితే అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ వారి ఎత్తుగడలను ఎప్పటికప్పుడు చిత్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న హెరాయిన్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో కోట్ల రూపాయల్లో ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ తాజా ఘటన నేపథ్యంలో సరిహద్దు వెంబడి, ముఖ్యంగా బహదూర్‌పూర్ పరిసర ప్రాంతాల్లో నిఘాను మరింత ముమ్మరం చేశారు. డ్రోన్ల కదలికలు లేదా ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే భద్రతా దళాలకు సమాచారం అందించాలని స్థానిక గ్రామస్తులకు పోలీసులు కఠిన సూచనలు జారీ చేశారు.


ANN MAHAA AWARDS
VIJAYAWADA
UNDAVALLI CAVES

# ఫ్లాప్ ఇచ్చిన డైరెక్టర్‌తో చై మూవీ!



ఆనందం, రన్, సండైకోళి (పందెం కోడి), పయ్యా (ఆవారా), అంజాన్ (సికిందర్) వంటి పలు విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు లింగుస్వామి. నిర్మాతగానూ పలు సక్సెస్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ఈయన ఇటీవల మంచి హిట్ కోసం ప్రయత్నిస్తున్నారనే చెప్పాలి. సండైకోళి చిత్రంతో విశాల్‌కు సూపర్ హిట్ చిత్రాన్ని ఇచ్చిన లింగుస్వామి ఇటీవల దానికి సీక్వెల్‌గా పందెం కోడి 2 చిత్రాన్ని చేశారు. అది అంచనాలను అందుకోలేకపోయింది.

### చిన్న గ్యాప్ తర్వాత..

ఆ తర్వాత టాలీవుడ్ హీరో రామ్‌పోతినేని కథానాయకుడిగా ది వారియర్ చిత్రాన్ని చేశారు. కానీ ఈ మూవీ కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేదు. దీంతో చిన్న గ్యాప్ తీసుకున్న ఈయన సంగీత దర్శకుడు విద్యాసాగర్ వారసుడిని హీరోగా పరిచయం చేయడానికి సిద్ధం అయ్యారు. అయితే ఆ చిత్రం ఏమైందో గానీ తాజాగా నాగచైతన్యతో మూవీ చేయబోతున్నట్లు సమాచారం.

### సినిమా

ఇది మంచి యాక్షన్‌తో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టెయినర్‌గా ఉంటుందని సమాచారం. ఈ మధ్య తండేల్ చిత్రంతో మంచి సక్సెస్ అందుకున్న నాగ చెతన్య ప్రస్తుతం వృషకర్మ అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం తర్వాత లింగుస్వామి దర్శకత్వంలో నటించే అవకాశం ఉంది. అయితే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తమిళంలో వెంకట్ ప్రభు డైరెక్షన్‌లో కస్టడీ సినిమా చేసి చేతులు కాల్చుకున్న చై.. లింగుసామితో సినిమా చేస్తాడా? లేదా? చూడాలి!

## బర్త్ డే రోజు తారక్ స్పెషల్ పోస్ట్..

# వాటిని పరిచయం చేస్తూ..



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ ఇంట్లో కొత్త అతిథులు వచ్చి చేరాయి. రెండు అందమైన రామచిలుకలు తారక్‌తో కలిసి ఆడుకుంటున్నాయి. అందుకు సంబంధించిన ఫోటోలను ఎన్టీఆర్ తన బర్త్‌డే (మే 20) సందర్భంగా సోషల్ మీడియాలో షేర్ చేశాడు. వాటికి అసాహి, యూహి అని పేర్లు పెట్టినట్లు తెలిపాడు. ఇవి జపనీస్ పేర్లు. అసాహి అంటే సూర్యోదయం, యూహి అంటే సూర్యాస్తమయం అని అర్థం. జపాన్ దేశంపై తనకున్న ప్రేమతోనే పెంపుడు పక్షులకు జపనీస్ పేర్లు పెట్టినట్లు వెల్లడించాడు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

### తారక్ కెరీర్ మొదలైందిలా..

దివంగత నటుడు ఎన్టీరామారావు నట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాడు జూనియర్ ఎన్టీఆర్. తాత ఎన్టీఆర్ నటించిన బ్రహ్మర్షి విశ్వామిత్రలో బాలనటుడిగా తొలిసారి తెరపై కనిపించాడు. నిన్ను చూడాలని చిత్రంతో హీరోగా మారాడు. స్టూడెంట్ నెం.1, ఆది, అల్లరి రాముడు, సింహాద్రి, ఆంధ్రావాలా, యమదొంగ, అదుర్స్, నాన్నకు ప్రేమతో, జనతా గ్యారేజ్, ఆర్ఆర్ఆర్.. ఇలా అనేక హిట్ చిత్రాల్లో నటించాడు. చివరగా తెలుగులో దేవర: పార్ట్ 1తో హిట్ అందుకున్నాడు. హృతిక్ రోషన్ వార్ 2 మూవీతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చాడు. కానీ, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో డ్రాగన్ సినిమా చేస్తున్నాడు. ఈ మూవీ వచ్చే ఏడాది జూన్‌లో విడుదల కానుంది. అలాగే తారక్ చేతిలో దేవర 2 కూడా ఉంది.








# వెనక్కు తిరిగి చూసుకుంటే..

మలయాళం, తమిళ, తెలుగు భాషల్లో నటిస్తూ క్రేజీ కథానాయికగా రాణిస్తోంది హీరోయిన్ మమితా బైజు. మలయాళంలో నటించిన ప్రేమలు చిత్రంతో అందరి దృష్టిని తనవైపు ఆకర్షించింది. ఆ తర్వాత కోలీవుడ్, టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి దక్షిణాదిలో ట్రెండింగ్ హీరోయిన్‌గా వెలుగొందుతోంది. ఇటీవల డ్యూడ్ మూవీతో మరో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉంది. ఈమె విజయ్‌తో కలిసి నటించిన జననాయకన్ (తెలుగులో జన నాయకుడు) చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది.

### అదే నా లక్ష్యం

అలాగే సూర్యకు జంటగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' కూడా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇకపోతే అశోక్ సెల్వన్‌కు జంటగా నటించిన ఇరండు విధానం చిత్రం కూడా విడుదలకు రెడీ అవుతోంది. ఈ చిత్రాలు విడుదలైన తర్వాత మమితా బైజు క్రేజ్ వేరేగా ఉంటుందని భావించవచ్చు. ఇటీవల ఈ అమ్మడు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నా అభిమానుల గుండెల్లో నిలిచిపోయే చిత్రాలను చేయాలన్నదే నా లక్ష్యం. అలా ఒక ప్రేమైక కుటుంబాన్ని తయారు చేసుకోవాలని కోరుకుంటున్నాను. ఇకపోతే ఏదో ఒక రోజున నా జరిగిన కాలం గుర్తుకు వస్తే ఆనందం కలగాలి. అందుకోసమే నా ఈ ప్రయాణం' అని మమిత పేర్కొంది.

# క్లాసిక్ లుక్స్ తో కిక్కెస్తున్న బన్నీ వాక్స్..

బన్నీవాక్స్ పేరుతో టిక్ టాక్‌లో వీడియోలను చేస్తూ అందరిని ఆకట్టుకున్న ఈ భామ అసలు పేరు వర్షిన్నె వర్మ. ఈ అందాల తార కేవలం టిక్ టాక్ లోనే కాకుండా యూట్యూబ్ లో షార్ట్ ఫిల్మ్స్, కవర్ సాంగ్స్ చేస్తూ తనకంటూ తనకంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంది.అంతే కాదు యూట్యూబ్ లో షార్ట్ ఫిలిమ్స్, కవర్ సాంగ్స్ చేస్తూ తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ.2020లో తెలుగు సినిమా విద్యార్థిలో ఆమె తొలిసారిగా నటించింది. తర్వాత ఇటీవలే విడుదలైన రాచి గాడి పెళ్లి చిత్రంలో కనిపించింది.ఈ అమ్మ చేసిన 'ఓ పిల్ల సాంగ్' ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఇక ఇటీవల ఈమె చేసిన 'వెన్నెల' సాంగ్ ప్రస్తుతం యూట్యూబ్‌లో మంచి వ్యూస్ తో ట్రెండింగ్ లో ఉంది. బన్నీవాక్స్‌కి (వర్షిన్నె వర్మ) ఇన్‌స్టాగ్రామ్ 20 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఈ మధ్య ఉన్న ఇన్‌స్టాలో చాలా యాక్టివ్ గా ఉంటూ ఫోటోలను షేర్ చేస్తుంటుంది. గ్లామర్ ఫీల్డ్ లో రాణించాలంటే అందాల విందు తప్పనిసరి. అందుకు ఇంస్టాగ్రామ్ వేదికగా మారింది. వెండితెర, బుల్లితెర సెలబ్రిటీలు హాట్ ఫోటో షూట్స్ తో హోరెత్తిస్తున్నారు.

# ఒక్కసారి మోసం చేస్తే జీవితాంతం క్షమించకూడదా?

తెలిసో తెలియకో ఏదో ఒకసారి చీటింగ్ చేస్తే తప్పేం కాదంటోంది హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. అలా అని మోసం చేయడాన్ని తాను సమర్థించడం లేదని చెప్తోంది. రకుల్ కథానాయికగా నటించిన తాజా చిత్రం 'పతీ పత్నీ ఔర్ వో దో'. ఇటీవల రిలీజైన ఈ హిందీ సినిమా ఇప్పటివరకు రూ.30 కోట్లకు పైగా రాబట్టింది. పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ఆడుతోంది.

**మోసం చేస్తే?**

ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా హీరో ఆయుష్మాన్ ఖురానా, హీరోయిన్లు సారా అలీ ఖాన్, రకుల్ ప్రీత్ ఓ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు పార్ట్‌నర్ మోసం చేస్తే ఒప్పుకుంటారా? అన్న ప్రశ్నకు ముగ్గురూ విభిన్నంగా స్పందించారు. మొదటగా సారా అలీ ఖాన్.. మోసం చేయడం సరికాదు, కానీ మోసం జరిగితే మాత్రం కచ్చితంగా సారీ చెప్పాలి అంది. దానికి రకుల్ కూడా అవునని వంత పాడింది. అయితే ఆయుష్మాన్ ఖురానా మాత్రం పెళ్లయ్యాక ప్రత్యేక షరతులుంటాయి.

**మానవ సహజం**

ఒకవేళ ఏదైనా పొరపాటు జరిగి, దానికి బాధపడుతూ నిజాయితీగా సారీ చెప్పినప్పుడు క్షమించేయడమే ఉత్తమం. మనిషన్నాక చిన్నపాటి పొరపాట్లు చేస్తూనే ఉంటాడు. వాటిని పెద్దగా చూడకూడదు. అయితే పొరపాట్లు చేయడమే పనిగా పెట్టుకోవడం మాత్రం సరికాదు అన్నాడు. అలాగైతే ఒకసారి చీట్ చేస్తే క్షమించేయొచ్చా? అని సారా అడగ్గా కుదరదని రకుల్ బదులిచ్చింది.

**అది సరికాదు**

కానీ, అంతలోనే మళ్లీ మాట మార్చేసింది. 'ఎవరైనా అనుకోకుండా పొరపాటు చేస్తే మాత్రం క్షమించేయొచ్చు. ఎందుకంటే జీవితం చాలా పెద్దది. ఒక్క పొరపాటు చేసినందుకు జీవితాంతం అవతలి వ్యక్తిని క్షమించకుండా ఉండటం కరెక్ట్ కాదు. అలా అని ఇది నా జీవితానికి, నా భర్తకు వర్తించదు' అని రకుల్ పేర్కొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com